# పెన్ పవర్

తెలుగు దిన పత్రిక PEN POWER TELUGU DAILY ప్రశ్నించడం మన హక్కు

12 YEARS PEN POWER JOURNEY 2014 - 2026 ప్రశ్నంచడం మన హక్కు

విశాఖపట్నం | హైదరాబాద్ | ఉభయ గోదావరి | ఎన్. టి. ఆర్ | గుంటూరు | ప్రకాశం | నెల్లూరు | తిరుపతి | చిత్తూరు | కడప

సంపుటి : 10 సంచిక : 29 పేజీలు :8 సంపాదకులు : జి.ఎ.రావు ( ఆనంద్ గంట్యాడ) ప్రచురణ : కాకినాడ ఆదివారం 4 అక్టోబర్ 2026 వెల : 1/-రూ ॥

VOLUME 10 ISSUE :29 PAGES :8 EDITOR : G. A. RAO ( ANAND GANTYADA ) PUBLISHED : KAKINADA SUN 4 OCTOBER 2026 PRICE : 1/- RS

Simultaneously Published form Kakinada,Ongole,Visakhapatnam,Bapatla,Narasarao Peta, YSR Kadapa,Circulated by :Srikakulam,manyam,Vizianagaram,East Godavari,West Godavari,Eluru,Guntur,SPSR Nellore,Tirupati,Chittor,Kurnool,Anantapur

## అంతా బాగుందనుకుంటే ప్రమాదమే..
## రానున్న ఆర్థిక సవాళ్లపై ఆర్‌బీఐ గవర్నర్ వార్నింగ్



- ప్రపంచ ఆర్థిక వ్యవస్థపై ఒత్తిడి పెరుగుతోందన్న ఆర్‌బీఐ గవర్నర్
- ఆర్థిక ముప్పులపై ఎప్పుడూ అప్రమత్తంగా ఉండాలన్న మల్హోత్రా
- ప్రపంచ దేశాల మధ్య విభేదాలు పెరుగుతున్నాయని వెల్లడి
- వాణిజ్య ఆంక్షలు, సరఫరా సమస్యలు ప్రభావం చూపుతున్నాయని ప్రకటన
- ఆర్థిక సమస్యలు ఒక్కసారిగా బయటపడొచ్చని హెచ్చరిక

పెన్ పవర్ డెస్క్:ప్రపంచ ఆర్థిక వ్యవస్థ ప్రస్తుతం అనేక సవాళ్లను ఎదుర్కొంటోందని ఆర్‌బీఐ గవర్నర్ సంజయ్ మల్హోత్రా అన్నారు. ప్రపంచ దేశాల మధ్య విభేదాలు, వాణిజ్య ఆంక్షలు, సరఫరా సమస్యలు, సాంకేతిక మార్పులు, వాతావరణ మార్పులు ఆర్థిక వ్యవస్థపై ప్రభావం చూపుతున్నాయని చెప్పారు. ఈ పరిస్థితుల్లో ఆర్థిక ముప్పుల విషయంలో ఎప్పుడూ అప్రమత్తంగా ఉండాలని సూచించారు.

- మిగతా 2లో



లోక్‌సభ, అన్ని రాష్ట్రాల అసెంబ్లీలను

## తక్షణమే రద్దు చేయాలి

- దేశంలో జరిగినవన్నీ అక్రమ ఎన్నికలేనన్న ఖర్గే
- మోదీ, అమిత్ షాతో పాటు అందరూ అక్రమంగా పదవుల్లో ఉన్నారని వ్యాఖ్య
- ఈవీఎంల దుర్వినియోగం జరిగిందని ఆరోపణ

పెన్ పవర్ డెస్క్:కాంగ్రెస్ పార్టీ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే కేంద్ర ప్రభుత్వంపై సంచలన ఆరోపణలు చేస్తూ, తీవ్రమైన డిమాండ్‌ను తెరపైకి తెచ్చారు. దేశంలో జరిగిన ఎన్నికలన్నీ అక్రమమని ఆరోపిస్తూ, లోక్‌సభతో పాటు అన్ని రాష్ట్రాల అసెంబ్లీలను తక్షణమే రద్దు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. కర్ణాటకలోని కలబుర్గిలో

- మిగతా 2లో



## ఆ నీచులను వదిలిపెట్టను
### ఎన్టీఆర్ స్ట్రాంగ్ వార్నింగ్

పెన్ పవర్ డెస్క్: సామాజిక మాధ్యమాల్లో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (AI) సాంకేతికతను ఉపయోగించి అసభ్యకర రీతిలో వీడియోలను క్రియేట్ చేయడంపై అగ్రకథానాయకుడు ఎన్టీఆర్ తీవ్ర ఆగ్రహం

- మిగతా 2లో

## యూపీలో కాంగ్రెస్‌కు 50 సీట్లు కూడా ఎక్కువే
### సమాజ్‌వాదీ ఎంపీ శివ్‌పాల్ సింగ్ పటేల్



- యూపీలో సీట్ల పంపకాలపై ఎస్పీ, కాంగ్రెస్ మధ్య రాజుకున్న వేడి
- ప్రస్తుతం కాంగ్రెస్‌కు ఇద్దరు ఎమ్మెల్యేలే ఉన్నారన్న ఎస్పీ ఎంపీ శివ్‌పాల్ సింగ్
- సీట్ల పంపకాలపై అక్టోబర్‌లో జరిగే చర్చల్లో అఖిలేశ్‌దే తుది నిర్ణయమని వెల్లడి
- పొత్తు వల్ల కాంగ్రెస్‌కే అధిక ప్రయోజనమని వ్యాఖ్య
- 150 సీట్లు కావాలంటూ ఇప్పటికే తమ మనోగతాన్ని బయటపెట్టిన కాంగ్రెస్

- మిగతా 2లో

## రైతులపై ప్రేమ ప్రచారానికే పరిమితం



పెన్ పవర్ డెస్క్:ఏపీలో గ్లోబల్ హార్టికల్చర్ హబ్ కు శంకుస్థాపన సందర్భంగా మదనపల్లి సభలో చంద్రబాబు చేసిన వ్యాఖ్యలకు ఎక్స్ వేదికగా కౌంటర్ ఇచ్చారు వైసీపీ అధినేత వైఎస్ జగన్. హార్టికల్చర్ పై చంద్రబాబు మాటలు డ్రామాలని..బడ్జెట్ కేటాయింపులు లేకుండా ఎలా ఖర్చు చేస్తారని ప్రశ్నించారు జగన్. రైతులపై చంద్రబాబు ప్రేమ

- మిగతా 2లో




## క్యూ-శివ, అమరావతి
# డిక్లరేషన్..
### పాన్ ఐఐటీ సమ్మిట్ లో కీలక ఘట్టాలను ఆవిష్కరించిన చంద్రబాబు

- విజయవాడలో పాన్ ఐఐటీ సమ్మిట్-2026
- హాజరైన సీఎం చంద్రబాబు
- డీప్‌టెక్ స్టార్టప్‌ల కోసం రూ.500 కోట్ల వెంచర్ ఫండ్ ఏర్పాటు
- అమరావతిలో శాశ్వత పాన్ ఐఐటీ కౌన్సిల్ ఏర్పాటుకు నిర్ణయం
- వచ్చే ఫిబ్రవరి నుంచి అమరావతిలో క్వాంటం కంప్యూటర్ ఆపరేషన్స్
- క్వాంటం వ్యాలీగా అమరావతిని తీర్చిదిద్దుతామన్న సీఎం చంద్రబాబు

పెన్ పవర్ డెస్క్:ఆంధ్రప్రదేశ్ భవిష్యత్తు సాంకేతిక ప్రగతికి, పెట్టుబడులకు కేంద్రంగా నిలవనుందనడానికి విజయవాడలో జరిగిన పాన్ ఐఐటీ అమరావతి సమ్మిట్ 2026 నిలువుటద్దం పట్టింది. ఈ సదస్సులో ముఖ్యమంత్రి చంద్రబాబు ఆధ్వర్యంలో రాష్ట్ర అభివృద్ధికి సంబంధించి

- మిగతా 2లో

# 3 లక్షల ఇళ్లకు శంకుస్థాపన..
### నేడు తెనాలికి సీఎం చంద్రబాబు, కేంద్ర మంత్రి శివరాజ్ సింగ్

- పేదల కోసం మరో 3 లక్షల ఇళ్ల నిర్మాణానికి శ్రీకారం
- కేంద్ర మంత్రి శివరాజ్ సింగ్‌తో కలిసి శంకుస్థాపన చేయనున్న సీఎం చంద్రబాబు
- దేశంలోనే తొలిసారిగా 3డీ కాంక్రీట్ ప్రింటింగ్ ఇళ్ల ప్రాజెక్టుకు భూమిపూజ
- గుంటూరు జిల్లా తెనాలి నియోజకవర్గంలో రేపు ఈ కార్యక్రమం
- గత 28 నెలల్లో ప్రభుత్వం 5.50 లక్షల ఇళ్లను లబ్ధిదారులకు అందించింది



పెన్ పవర్ డెస్క్:రాష్ట్రంలో పేదల సొంతింటి కలను సాకారం చేసే దిశగా ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం మరో కీలక ముందడుగు వేస్తోంది. ప్రధాన మంత్రి ఆవాస్ యోజన-గ్రామీణ్ (PMAY-G) 2.0 పథకం కింద కేంద్ర ప్రభుత్వం కొత్తగా మంజూరు చేసిన మూడు లక్షల ఇళ్ల నిర్మాణానికి ముఖ్యమంత్రి చంద్రబాబు, కేంద్ర గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్‌తో కలిసి (అక్టోబరు 4) భూమిపూజ చేయనున్నారు. గుంటూరు జిల్లా తెనాలి నియోజకవర్గంలోని బుర్రిపాలెం గ్రామంలో ఈ కార్యక్రమం జరగనుంది.కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన ఈ 28 నెలల కాలంలో ఇప్పటికే 5.50 లక్షల ఇళ్లను లబ్ధిదారులకు అందించింది. గతేడాది నవంబరులో 3 లక్షలు, ఈ ఏడాది మార్చిలో 2.50 లక్షల ఇళ్లకు సామూహిక గృహ ప్రవేశాలు నిర్వహించిన ప్రభుత్వం, ఇప్పుడు మరో భారీ కార్యక్రమానికి శ్రీకారం చుడుతోంది. రాష్ట్ర ప్రభుత్వ విజ్ఞప్తి మేరకు కేంద్రం ఇటీవలే ఈ 3 లక్షల ఇళ్లను కేటాయించింది. దీంతో ఏమాత్రం జాప్యం చేయకుండా నిర్మాణ పనులను ప్రారంభించాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఇదే సమయంలో, వచ్చే ఏడాది మార్చి నాటికి మరో 4.20 లక్షల ఇళ్ల నిర్మాణం పూర్తి చేసి లబ్ధిదారులకు అప్పగించాలని లక్ష్యంగా పెట్టుకుంది.

**దేశంలోనే తొలిసారిగా 3డీ ప్రింటింగ్ టెక్నాలజీ**

ఈ కార్యక్రమంతో పాటు, గృహ నిర్మాణ రంగంలో విప్లవాత్మక మార్పులకు నాంది పలుకుతూ దేశంలోనే తొలిసారిగా 3డీ కాంక్రీట్ ప్రింటింగ్ టెక్నాలజీతో ఇళ్ల నిర్మాణానికి సంబంధించిన పైలట్ ప్రాజెక్టుకు కూడా చంద్రబాబు, శివరాజ్ సింగ్ చౌహాన్ శంకుస్థాపన చేయనున్నారు. కేంద్ర గ్రామీణాభివృద్ధి మంత్రిత్వ శాఖ, సీఎస్ఐఆర్-సీబీఆర్ఐ (రూర్కీ), ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం సంయుక్తంగా

- మిగతా 2లో



## సుప్రీం తీర్పు తర్వాతే మున్సిపల్ ఎన్నికలు

- స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీ రిజర్వేషన్లపై సుప్రీంకోర్టుకు వెళ్లిన ఏపీ ప్రభుత్వం
- బీసీ రిజర్వేషన్లకు ప్రభుత్వం కట్టుబడి ఉందన్న నారాయణ
- గత ప్రభుత్వం వల్లే అమరావతి అభివృద్ధి ఆగిపోయిందని విమర్శ

పెన్ పవర్ డెస్క్:స్థానిక సంస్థల ఎన్నికల్లో వెనుకబడిన తరగతులకు (బీసీ) 34 శాతం రిజర్వేషన్లు కల్పించే అంశంపై ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం సుప్రీంకోర్టును ఆశ్రయించడం తెలిసిందే. ఈ క్రమంలో

- మిగతా 2లో



## అమిత్ షా తెలంగాణ పర్యటన రద్దు..
### చివరి నిమిషంలో కీలక నిర్ణయం!

- తొలుత అక్టోబర్ 4న పర్యటనకు ఖరారైన షెడ్యూల్
- మెదక్, కరీంనగర్‌లో పర్యటనకు ఏర్పాట్లు పూర్తి
- షెడ్యూల్‌లో పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు
- నిరాశలో బీజేపీ శ్రేణులు
- పర్యటనకు కారణాలు వెల్లడించని పార్టీ

పెన్ పవర్ డెస్క్: కేంద్ర హోంమంత్రి అమిత్ షా తెలంగాణ పర్యటన రద్దయింది. ఒక రోజు పర్యటన నిమిత్తం రేపు ఆయన రాష్ట్రానికి రావాల్సి ఉండగా.. చివరి నిమిషంలో కార్యక్రమాన్ని రద్దు చేసుకున్నారు. దానికి గల కారణాలేంటో అధికారికంగా

- మిగతా 2లో

## బీసీ రిజర్వేషన్లపై మాట్లాడే హక్కు వైసీపీకి లేదు



- బీసీలకు అధికారం దక్కకూడదని వైసీపీ కుట్ర చేసిందన్న రామ్మోహన్ నాయుడు
- రిజర్వేషన్ల కోసం కూటమి ప్రభుత్వం సుప్రీంకోర్టులో పోరాడుతోందని వెల్లడి
- టీడీపీకి బీసీలు వెన్నెముక వంటివారని వ్యాఖ్య

- మిగతా 2లో

## చంద్రబాబుకు ఇప్పుడు యంగ్ హార్డ్ వేర్ టీమ్ అండగా ఉంది



### పాన్ ఐఐటీ సమ్మిట్ లో మంత్రి లోకేశ్

- విజయవాడలో 'పాన్ ఐఐటీ సమ్మిట్ - 2026
- హాజరైన మంత్రి నారా లోకేశ్
- ఆంధ్రప్రదేశ్‌ను అభివృద్ధి చెందిన రాష్ట్రంగా మార్చడమే లక్ష్యమని ఉద్ఘాటన
- చంద్రబాబు అనుభవానికి యువ ఎమ్మెల్యేల బృందం తోడైందని వెల్లడి

- మిగతా 2లో




## ఫ్లైట్‌లో దాడి ముందస్తు పథకమా ?

ఫ్లైదుబాయ్ విమానంలో భారతీయ పైలట్, కెప్టెన్ స్మిత్ మచ్చుర్‌పై దాడి జరగడం కలకలం రేపింది. అది కూడా కో పైలట్ ఈ పని చేయడం ప్రపంచాన్ని ఆశ్చర్యానికి గురిచేసింది. మచ్చుర్‌పై దాడికి యత్నించిన కో-పైలట్ హమామ్ అల్-హమామీకి సంబంధించి పలు కొత్త విషయాలు బయటకు వస్తున్నాయి. పలు నివేదికల ప్రకారం, అతడి పాత సోషల్ మీడియా అకౌంట్లు పరిశీలనలో అల్-ఖైదాతో సంబంధం ఉన్న వ్యక్తుల ఫోటోలు, ఇతర అనుమానాస్పద వ్యక్తులకు సంబంధించిన సమాచారం లభించాయి. యూఏఈ అటార్నీ జనరల్ ఈ ఘటనపై ప్రత్యేక బృందాన్ని ఏర్పాటు చేశారు. ఉగ్రదాడి, హైజాక్ కోణంలో దర్యాప్తు చేస్తున్నారు. నివేదికల ప్రకారం, హమామ్ అల్-హమామీ ఒమన్‌కు చెందిన పౌరుడు. అతడు యూఏఈ లో జన్మించాడని కొన్ని నివేదికలు చెబుతుండగా.. అతని తండ్రి ఒమన్ పౌరుడని, తల్లి సిరియాకు చెందిన వ్యక్తి అని తెలిసింది. అతడు కొన్నేళ్లపాటు యూఏఈలో గడిపాడు. అతని పేరుతో ఉన్న లింక్డ్ఇన్ ప్రొఫైల్ ప్రకారం, ఒమన్ ఎయిర్‌లో దాదాపు ఏడేళ్లు పనిచేశాడు. ఆ తర్వాత రాయల్ ఎయిర్ మరోక్ తో అనుబంధం కలిగి ఉన్నాడు. ఆ తర్వాత ఫ్లైదుబాయ్‌లో కో-పైలట్‌గా చేరి సేవలు అందిస్తున్నాడు. 024లో నిందితుడు, కో పైలట్ హమామ్ అల్ హమామీని ఒమన్ ఎయిర్‌లో ఫ్లైట్ ట్రైనింగ్ నుంచి తప్పించారు. తీవ్రవాద భావజాలం వల్ల ఆకర్షితుడు అవుతున్నాడని అతడిపై అనుమానం వచ్చింది. దాంతో తలెత్తిన భద్రతా పరమైన ఆందోళనలే అతడ్ని తొలగించడానికి కారణమని సమాచారం. అతడిని ఎయిర్‌లైన్ నుంచి పూర్తిగా తొలగించకుండా ఇతర, నాన్-ఫ్లయింగ్ బాధ్యతలు అప్పగించారని కొన్ని నివేదికలు చెబుతున్నాయి. అయితే, ఆ సమయంలో అతని సమాచారాన్ని ఇతర ఎయిర్‌లైన్లు లేదా సంబంధిత దేశాల సంస్థలతో ఎంతవరకు పంచుకున్నారనే అంశంపై స్పష్టత లేదు. సీఎన్ఎన్ నివేదిక ప్రకారం, హమామ్‌కు సంబంధించిన సోషల్ అకౌంట్లలో కొన్ని అనుమానాస్పద ఫోటోలు, వీడియోలు లభించాయి. అందులో అల్-ఖైదాతో సంబంధం ఉన్న వ్యక్తులు కనిపిస్తున్నారు. ఒక వీడియోలో బోయింగ్ 737 మాక్స్ కాక్‌పిట్ నుంచి వేర్వేరు విమానాల రికార్డింగ్ కనిపిస్తుంది. వీడియో చివరలో అల్-ఖైదా మాజీ చీఫ్ ఐమన్ అల్-జవాహిరీ, 2009లో జౙూ అధికారుల హత్యతో సంబంధం ఉన్న హుమామ్ ఖలీల్ అబూ-ములాల్ అల్-బలావీల ఫోటోలు ఉన్నాయని గుర్తించారు. ఈ పోస్టులపై కూడా దర్యాప్తు కొనసాగుతోంది. ఆ తర్వాత సోషల్ మీడియా ప్రొఫైళ్లు తొలగించారు. నివేదికల ప్రకారం, మరొక సోషల్ పోస్ట్‌లో ఏఐ సాయంతో తయారు చేసిన ఒక ఫొటో ఉంది. అందులో మక్కా, మదీనా, జెరూసలేంలను ఒక మెరుస్తున్న గీతతో కలిపాడు. దీంతో పాటు మరణం, అవమానానికి సంబంధించిన పదాలతో ఉన్న ఒక కవిత ఉన్నాయి. ఈ పోస్టులకు ప్రమాదంతో నేరుగా సంబంధం ఉందో లేదో దర్యాప్తులో తేలనుంది. సీఎన్ఎన్ నిపుణుల ప్రకారం, హమామ్ పాత, ఇప్పుడు తొలగించిన సోషల్ మీడియా పోస్టులలో మహిళల పట్ల కఠినమైన అభిప్రాయాలు ఉన్నాయి. పెళ్లి తర్వాత భార్య ఉద్యోగం చేయకూడదని, నిఖాబ్ ధరించాలని భావిస్తున్నట్లు పేర్కొన్నాడు. మరికొన్ని పోస్టులలో పురుషులు, మహిళలు కలసి పనిచేసే వర్క్ స్పేస్ లను పూర్తిగా వ్యతిరేకించాడు. సీఎన్ఎన్ 2021, 2022 నాటి దాదాపు 3,000 తొలగించిన పోస్టులను విశ్లేషించారు. ఈ పోస్టుల ద్వారా అతని వ్యక్తిగత, మతపరమైన ఆలోచనలు ఉన్నాయి. అయితే ఒక వ్యక్తి సోషల్ మీడియా ఆలోచనలకు, ఒక నేర సంఘటనకు నేరుగా లింక్ ఉందా లేదా అనే కోణాల్లోనూ దర్యాప్తు జరుగుతోంది. 30 సెప్టెంబర్ 2026న ఫ్లైదుబాయ్ విమానం ఫ్లై1073 దుబాయ్ నుంచి టెల్ అవీవ్‌కు వెళ్తుండగా కాక్‌పిట్‌లో ఇద్దరు పైలట్ల మధ్య గొడవ జరిగింది. కో పైలట్ హమామ్ అల్ హమామీ దాడిలో భారత కెప్టెన్ స్మిత్ మచ్చుర్ గాయపడ్డారు. యూఏఈ అధికారిక సమాచారం ప్రకారం, ఈ ఘటన తర్వాత విమానాన్ని సౌదీ అరేబియాలోని తబుక్ ఎయిర్ పోర్ట్ వైపు మళ్లించి అక్కడ ల్యాండ్ చేశారు. ప్రయాణికులు, విమానంలో ఉన్న ఇతర క్రూ సభ్యులు పరిస్థితిని అదుపులోకి తెచ్చారు. యూఏఈ జనరల్ సివిల్ ఏవియేషన్ అథారిటీ తరువాత కెప్టెన్ స్మిత్ మచ్చుర్ సురక్షితంగా యూఏఈకి తిరిగి రాగా, వైద్య చికిత్స కొనసాగుతోంది.

## లోక్‌సభ, అన్ని రాష్ట్రాల అసెంబ్లీలను తక్షణమే రద్దు చేయాలి

- మొదటి పేజి తరువాయి

ఆయన మీడియాతో మాట్లాడుతూ, దేశంలో ప్రస్తుత పాలన మొత్తం చట్టవిరుద్ధమైన ఎన్నికల పునాదిపైనే నడుస్తోందని ఆరోపించారు. ఈవీఎంల దుర్వినియోగం, ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణ (సర్)లో జరుగుతున్న అవకతవకల కారణంగానే ఈ డిమాండ్ చేస్తున్నట్లు ఖర్గే స్పష్టం చేశారు. “ఈ రోజు దేశం మొత్తం అక్రమ ఎన్నికల ద్వారానే నడుస్తోంది. మోదీ అక్రమ ప్రధాని, అమిత్ షా అక్రమ మంత్రి అని, దేశంలో ఎన్నికైన ముఖ్యమంత్రులందరూ అక్రమంగా ఆ పదవుల్లో ఉన్నట్టేనని అన్నారు. వాటన్నింటినీ రద్దు చేసి, కేవలం బ్యాలెట్ పత్రాలతోనే మళ్లీ ఎన్నికలు నిర్వహించాలి” అని చెప్పారు.

ఈ అంశంపై కాంగ్రెస్ వర్కింగ్ కమిటీతో పాటు ఇండియా కూటమి భాగస్వామ్య పక్షాలతో కూడా చర్చించినట్లు ఖర్గే తెలిపారు. ఈ అక్రమాలకు వ్యతిరేకంగా దేశవ్యాప్తంగా ఆందోళనలు చేపట్టాలని నిర్ణయించామని, అందులో భాగంగా అక్టోబర్ 6వ తేదీన ఢిల్లీలో విపక్ష ఎంపీలందరూ కలిసి ఎన్నికల సంఘం కార్యాలయానికి నిరసన ర్యాలీ నిర్వహిస్తారని వివరించారు. ఓటర్ల జాబితా నుంచి కొన్ని వర్గాల ప్రజల పేర్లను తొలగించే ప్రయత్నాలు జరుగుతున్నాయని, దీనిపై యువతలో చైతన్యం కల్పిస్తామని ఆయన పేర్కొన్నారు.

## ఆ నీచులను వదిలిపెట్టను

- మొదటి పేజి తరువాయి

వ్యక్తం చేశారు. దేవర సినిమాలోని ‘చుట్టమల్లే’ పాట వీడియోను ఏఐతో మార్ఫింగ్ చేయడంపై ఆయన మండిపడ్డారు. మహిళలను పూజించే దేశంలో వారి గౌరవాన్ని దిగజార్చారంటూ ఎక్స్‌లో పోస్ట్ చేశారు. వారిని వదిలిపెట్టబోనని, బాధ్యులపై న్యాయపరమైన చర్యలు తీసుకుంటానని హెచ్చరించారు. “ఇది అత్యంత అసహ్యకరమైన చర్య. మహిళలను తల్లులుగా, దేవతలుగా పూజించే నేల మనది. ‘మాతృదేవోభవ’ అనే నినాదం మన సంస్కృతిలో భాగమైన చోట.. కొందరు వ్యక్తులు అత్యంత దిగజారి ప్రవర్తిస్తున్నారు. ఒక మహిళను అవమానించేలా ఏఐ సాంకేతికతను దుర్వినియోగం చేస్తూ ఇలాంటి నీచమైన కంటెంట్‌ను సృష్టించడం సిగ్గుచేటు. ‘చుట్టమల్లే’ పాట మార్ఫింగ్ వీడియో వెనుక ఉన్న నీచులు ఎవరినీ వదిలిపెట్టను” అని ఎన్టీఆర్ హెచ్చరించారు.

ఇక ఇలాంటి అసభ్యరమైన కంటెంట్‌ను ఎవరూ చూడొద్దని ఎన్టీఆర్ విజ్ఞప్తి చేశారు. “ఈరోజు వేరొక మహిళకు ఇలాంటి అవమానం జరిగింది. రేపు మీ ఇంట్లో మీ తల్లి, భార్య, కుమార్తెకూ ఇదే పరిస్థితి ఎదురవ్వొచ్చు. ఏఐ దుర్వినియోగాన్ని అరికట్టడానికి, బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవడానికి కేంద్రంతో పాటు అన్ని రాష్ట్ర ప్రభుత్వాలు వెంటనే కఠినమైన నిబంధనలు తీసుకురావాలని కోరుతున్నాను” అని ఎన్టీఆర్ పేర్కొన్నారు. ఏఐ మార్ఫింగ్ ఫొటోలు, వీడియోలు సెలబ్రిటీల పాలిట నరకంగా మారాయి. ఇటీవల ‘అర్జున్ రెడ్డి’ హీరోయిన్ శాలిని పాండే కూడా దీని బారిన పడ్డారు. ఆమెపై అసభ్యకర రీతిలో వీడియోలను రూపొందించగా అవి వైరల్ అయ్యాయి. దీనిపై ఆమె ఆవేదన వ్యక్తం చేశారు. టెక్నాలజీని ఇలా ఉపయోగించడం సరికాదంటూ మండిపడ్డారు. ఆ వీడియో కనిపిస్తే ఎవరూ షేర్, డౌన్‌లోడ్ చేయొద్దని.. వెంటనే రిపోర్ట్ చేయాలని విజ్ఞప్తి చేశారు. గతంలో రష్మిక, కత్రినా కైఫ్, మృణాల్ ఠాకూర్, కీర్తి సురేశ్‌కు సంబంధించిన డీప్‌ఫేక్ వీడియోలు కూడా వైరలైన సంగతి తెలిసిందే.

## రైతులపై ప్రేమ ప్రచారానికే పరిమితం

- మొదటి పేజి తరువాయి

ప్రచారానికే పరిమితమని.. చంద్రబాబు పాలనలో ధరల స్థిరీకరణ నిధి నిర్వీర్యమైందని అన్నారు జగన్. చంద్రబాబు అధికారంలోకి వచ్చాక ఉచిత పంటల బీమా, సున్నా వడ్డీ పథకం రద్దు చేశారని అన్నారు. రాయలసీమలో 7-8 లక్షల బోర్లు ఎండిపోయాయని.. రాయలసీమ లిఫ్ట్ ప్రాజెక్టుకు చంద్రబాబే అడ్డంకి అని అన్నారు జగన్. రైతుల కష్టాలను ప్రభుత్వం పట్టించుకోవడం లేదని మండిపడ్డారు. కరువు నివారణ చర్యలు వెంటనే చేపట్టాలని డిమాండ్ చేశారు జగన్. తీవ్రమైన కరువు కారణంగా రాయలసీమలో ఇప్పుడు తీవ్ర దుర్భిక్షం నెలకొంటే, వేలాది ఎకరాల్లో హార్టికల్చర్ తోటలు ఎండిపోతుంటే, మీరు వాటర్ మ్యాన్ అని బిల్డప్ ఇవ్వడం చూసి ప్రజలు నవ్వుకుంటున్నారని ఎద్దేవా చేశారు. ఇక హార్టికల్చర్ హబ్ సంగతి పక్కనపెడితే, రైతుల ఆత్మహత్యలకు చిరునామాగా రాయలసీమ సహా రాష్ట్రం మొత్తం తయారయ్యిందని... మీ డ్రామాలు, బిల్డప్‌లు కట్టిపెట్టి, రైతులకు ఊరటనిచ్చేలా తక్షణమే కరువు నివారణా చర్యలు మొదలుపెట్టండని ఎక్స్ వేదికగా ట్వీట్ చేశారు జగన్.

# క్వ్యా-శివ, అమరావతి డిక్లరేషన్..

- మొదటి పేజి తరువాయి

పలు కీలక ఘట్టాలు ఆవిష్కృతమయ్యాయి. డీప్‌టెక్నాలజీ అభివృద్ధికి ఊతమిచ్చేలా రూ. 500 కోట్ల వెంచర్ ఫండ్ ఏర్పాటు చేస్తూ చారిత్రక ‘అమరావతి డిక్లరేషన్’ విడుదల చేయడంతో పాటు, “మేకిన్ అమరావతి” సంకల్పంతో రూపొందించిన ఐదు “క్యూ-శివ” క్వాంటం కంప్యూటర్లను సీఎం ఆవిష్కరించారు. క్యూబిట్ ఫోర్స్ సంస్థ, చండీఘడ్ యూనివర్సిటీ సంయుక్తంగా అభివృద్ధి చేసిన ఈ క్యూ-శివ కంప్యూటర్లు మినీ టెస్టింగ్ క్వాంటం ల్యాబ్‌లుగా పనిచేస్తాయి. వీటితో పాటు 4 కెల్విన్ ప్రాసెసర్ ‘సృష్టి’ని కూడా ముఖ్యమంత్రి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా క్యూబిట్ సంస్థ సీఈఓ వెంకటసుబ్రమణ్యం మాట్లాడుతూ.. ఈ కంప్యూటర్ల తయారీకి అవసరమైన కొన్ని కీలక కాంపోనెంట్లు ప్రపంచంలో ఒకటి రెండు చోట్ల మాత్రమే లభిస్తాయని, అలాంటివి మన మచిలీపట్నంలో దొరకడం విశేషమని తెలిపారు. తమ ప్రయత్నానికి సీఎం చంద్రబాబు అందించిన సహకారం మరువలేనిదని ఆయన పేర్కొన్నారు. అనంతరం క్యూబిట్ ప్రతినిధుల కృషిని అభినందించిన ముఖ్యమంత్రి, వారితో కలిసి సెల్ఫీ దిగి ఉత్సాహపరిచారు.

**అమరావతి డిక్లరేషన్.. డీప్‌టెక్‌కు ఊతం**

ఈ సదస్సులో ఏపీ ప్రభుత్వం, పాన్ ఐఐటీ అలుమ్ని ప్రతినిధులు సంతకాలు చేసిన ‘అమరావతి డిక్లరేషన్’ ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. దీని ప్రకారం, అమరావతిలో ఏపీ ప్రభుత్వం-పాన్ ఐఐటీ అలుమ్ని ఇండియా ఆధ్వర్యంలో ఒక శాశ్వత కౌన్సిల్ ఏర్పాటు కానుంది. డీప్‌టెక్ స్టార్టప్‌లు, ఆవిష్కరణలు, పెట్టుబడులను ప్రోత్సహించేందుకు రూ. 500 కోట్ల పాన్ ఐఐటీ అమరావతి వెంచర్ ఫండ్‌ను ఏర్పాటు చేస్తున్నట్టు ప్రకటించారు. ఈ కౌన్సిల్ ద్వారా రాష్ట్రంలోని విశ్వవిద్యాలయాలు, పరిశ్రమలు, స్టార్టప్‌లను సమన్వయం చేస్తారు. రాష్ట్రంలోని విద్యా సంస్థల్లో 10 ఇండస్ట్రీ చైర్స్ ఏర్పాటు చేయడం, 100 మంది గ్లోబల్ ఐఐటీ మెంటర్లతో స్టార్టప్‌లకు మార్గనిర్దేశం చేయడం, 23 ఐఐటీల నుంచి టెక్నాలజీ ట్రాన్స్‌ఫర్ వంటివి ఈ డిక్లరేషన్‌లోని ముఖ్యాంశాలు. క్వాంటమ్-ఏఐ, సెమీకండక్టర్లు, స్పేస్-డిఫెన్స్ వంటి రంగాల్లో పెట్టుబడులను ఆకర్షించి, 2030 నాటికి కనీసం 50 స్టార్టప్‌లను ఇంక్యుబేట్ చేయాలనే లక్ష్యాన్ని నిర్దేశించారు.

**క్వాంటం వ్యాలీగా అమరావతి: సీఎం చంద్రబాబు**

ఈ సందర్భంగా ముఖ్యమంత్రి చంద్రబాబు మాట్లాడుతూ.. “గతంలో ఐటీని ప్రోత్సహిస్తే ప్రపంచవ్యాప్తంగా మన తెలుగువారు నిపుణులుగా ఎదిగారు. ఇప్పుడిక సిలికాన్ వ్యాలీ గురించి కాదు, అమరావతిలోని క్వాంటం వ్యాలీ గురించి ప్రపంచం చర్చించుకుంటుంది” అని ధీమా వ్యక్తం చేశారు. గతంలో తాను విజన్ 2020 తీసుకువచ్చినప్పుడు కొందరు ‘420’ అంటూ హేళన చేశారని, కానీ దాని ద్వారానే విద్యుత్, రహదారుల వంటి రంగాల్లో సంస్కరణలు వచ్చాయని గుర్తుచేశారు. ప్రధాని మోదీ నాయకత్వంలో దేశం అభివృద్ధి పథంలో పయనిస్తోందని, 2047 నాటికి భారత్ ప్రపంచంలోనే అగ్రగామి ఆర్థిక వ్యవస్థగా ఎదగడాన్ని ఎవరూ ఆపలేరని అన్నారు. జాతి నిర్మాణంలో భాగమైన ఐఐటీయన్లు వికసిత్ భారత్, స్వర్ణాంధ్ర లక్ష్యాల సాధనకు సహకరించాలని పిలుపునిచ్చారు. ఐబీఎం-టీసీఎస్, ఎల్ అండ్ టీ సంయుక్తంగా ఏర్పాటు చేయనున్న క్వాంటం కంప్యూటర్ ఆపరేషన్స్ వచ్చే ఏడాది ఫిబ్రవరి నుంచి అమరావతి నుంచే ప్రారంభమవుతాయని చంద్రబాబు ప్రకటించారు. భవిష్యత్తులో కేవలం వినియోగించుకోవడమే కాకుండా, క్వాంటం కంప్యూటర్లను తయారు చేసి ఎగుమతి చేసే స్థాయికి ఆంధ్రప్రదేశ్ చేరుకుంటుందని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు.

## చంద్రబాబుకు ఇప్పుడు యంగ్ హార్డ్ వేర్ టీమ్ అండగా ఉంది

ముఖ్యమంత్రి చంద్రబాబు అనుభవం అనే బలమైన సాఫ్ట్‌వేర్‌కు, యువతతో నిండిన చురుకైన హార్డ్‌వేర్ టీమ్ ఇప్పుడు అండగా నిలిచిందని, ఈ అరుదైన కలయికతో ఆంధ్రప్రదేశ్‌ను దేశంలోనే నంబర్ వన్ రాష్ట్రంగా తీర్చిదిద్దుతామని రాష్ట్ర ఐటీ, ఎలక్ట్రానిక్స్, విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ స్పష్టం చేశారు. విజయవాడలో జరిగిన ‘పాన్ ఐఐటీ సమ్మిట్ - 2026’లో ఆయన మాట్లాడుతూ.. ప్రధాని మోదీ ‘వికసిత్ భారత్’ లక్ష్యానికి తమ వంతు సహకారం అందిస్తామని, అభివృద్ధి చెందిన రాష్ట్రంగా ఏపీని మార్చడమే తమ ఉమ్మడి లక్ష్యమని అన్నారు.

“ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ప్రస్తుతం 4.0 ఆపరేటింగ్ సిస్టమ్‌తో మరింత ఉత్సాహంగా పనిచేస్తున్నారు. ఆయనకు ఇప్పుడు ఒక యంగ్ హార్డ్‌వేర్ టీమ్ అండగా ఉంది. మా శాసనసభ్యుల్లో 50 శాతం మంది మొదటిసారి గెలిచినవారే. 25 మంది మంత్రులలో 17 మంది తొలిసారి మంత్రులయ్యారు. అనుభవజ్ఞమైన సాఫ్ట్‌వేర్‌కు, ఈ యువ, డైనమిక్ హార్డ్‌వేర్ కలయికే నేటి ఆంధ్రప్రదేశ్‌ను ప్రత్యేకంగా నిలబెడుతోంది. ఏ రంగంలోనైనా ఆంధ్రప్రదేశ్ నంబర్ వన్‌గా ఉండాలన్నదే మా స్పష్టమైన విజన్” అని లోకేశ్ వివరించారు. 5 లక్షల మందికి పైగా ఐఐటీ గ్రాడ్యుయేట్లను కలిపే పాన్ ఐఐటీ సదస్సు ఏపీలో జరగడం ఆనందంగా ఉందన్నారు.

**అభివృద్ధికి ‘3ఎ’ మంత్రం**

అభివృద్ధి చెందిన దేశంగా మారడానికి భారత్‌కు ఒక దశాబ్దం చాలని, ఆ స్వర్ణ దశాబ్దం మనదే కావాలని ఆకాంక్షించిన లోకేశ్, దీనికి తమ ప్రభుత్వం ‘3ఎ’ మంత్రాన్ని అనుసరిస్తోందని తెలిపారు. “మొదటిది స్పీడ్ (వేగం), రెండోది సర్వీస్ (సేవ), మూడోది స్టెబిలిటీ (స్థిరత్వం). ప్రజలు మాకు ఇచ్చింది ఐదేళ్ల సమయం. ఈ సమయంలోనే ఫలితాలు చూపించాలి. కేవలం ఎంఓయూలు కుదుర్చుకుని వాటిని మర్చిపోయే రకం మాది కాదు. ప్రాజెక్టులకు వాస్తవ రూపమిచ్చి ఉద్యోగాలు సృష్టించాలన్న తపన మాది. పరిశ్రమదారులను మేము ‘జాతి నిర్మాణకర్తలు’గా భావిస్తున్నాం. వారితో కలిసి పనిచేస్తూ, ప్రపంచ స్థాయి పాలన అందించడమే మా సేవా దృక్పథం. ఇక మూడోది స్థిరత్వం. మా పాలసీలు కాలపరీక్షను, రాజకీయ మార్పులను తట్టుకుని నిలబడేలా ఉంటాయి” అని ఆయన అన్నారు. ఇందుకు ఉదాహరణగా, గత కేసులన్నింటినీ AI ద్వారా విశ్లేషించి, న్యాయపరమైన చిక్కులు రాకుండా 16,000 ఉపాధ్యాయుల నియామక ప్రక్రియను చేపట్టామని గుర్తుచేశారు.

**అమలుపైనే దృష్టి.. ఇవే మా నిదర్శనాలు**

కేవలం కాగితాలపై హామీలు కాకుండా, వాస్తవంగా అమలవుతున్న ప్రాజెక్టుల గురించి లోకేశ్ సవివరంగా మాట్లాడారు. “ఏపీలో నమో అంటే నాయుడు జీ, మోదీజీ జోడీ. డబుల్ ఇంజిన్ బుల్లెట్ ట్రైన్ ప్రభుత్వం ఉండటం వల్లే పనులు వేగంగా జరుగుతున్నాయి. ఏపీని గ్లోబల్ హార్టికల్చర్ హబ్‌గా మార్చాలన్న సీఎం సంకల్పంతో రిలయెన్స్ భాగస్వామ్యంతో మదనపల్లెలో ‘ఇండియన్ స్కూల్ ఆఫ్ అగ్రికల్చర్’కు శంకుస్థాపన చేశాం. ఇది లక్ష కోట్ల పెట్టుబడులను ఆకర్షిస్తుంది” అని తెలిపారు.

“ఇతర రాష్ట్రాల్లో దశాబ్దాలుగా నిలిచిపోయిన ఆర్సెలర్ మిట్టల్ స్టీల్ ప్లాంట్ ప్రాజెక్టుకు కేవలం 17 నెలల్లోనే పునాది వేశాం. విశాఖపట్నంలో గూగుల్ డేటా సెంటర్ కోసం కేంద్ర ప్రభుత్వంతో సమన్వయం చేసుకుని 13 నెలల్లోనే అనుమతులు సాధించి పనులు ప్రారంభించాం. దేశంలో ఎవరూ ఊహించని ధరకు స్పేస్ టెక్ స్టార్టప్ స్కైరూట్‌కు 300 ఎకరాలు కేటాయించాం. మారిటైమ్ డ్రోన్లు తయారుచేసే సాగర్ డిఫెన్స్ సంస్థకు ఫిషింగ్ హార్బర్‌లో స్థలం ఇవ్వగా, 18 నెలల్లో ఆ సంస్థ విలువ రూ. 3,000 కోట్ల నుంచి రూ. 23,000 కోట్లకు పెరిగింది. ఇదే మా ప్రభుత్వ నిబద్ధతకు నిదర్శనం” అని లోకేశ్ పేర్కొన్నారు.

**23 క్లస్టర్ల ఏర్పాటు.. అమరావతిపై ప్రత్యేక దృష్టి**

రాష్ట్రంలో హార్టికల్చర్ నుంచి క్వాంటం కంప్యూటింగ్ వరకు 23 పారిశ్రామిక క్లస్టర్లను ఏర్పాటు చేస్తున్నామని, రెన్యువబుల్ ఎనర్జీలో ఏడాదిలోనే 4.8 గిగావాట్ల సామర్థ్యాన్ని జోడించామని లోకేశ్ వెల్లడించారు. అమరావతి నిర్మాణంపై మాట్లాడుతూ, “మీరు అమరావతికి వస్తే, నిర్మాణంలో ఉన్న ఒక ఆధునిక నగరం కనిపిస్తుంది. ప్రపంచ ప్రఖ్యాత ఆర్కిటెక్ట్ నార్మన్ ఫాస్టర్ డిజైన్లతో అసెంబ్లీ, సచివాలయం వంటివి నిర్మిస్తున్నాం. ఇక్కడ 5,000 ఎకరాల్లో గ్రీన్‌ఫీల్డ్ ఎయిర్‌పోర్ట్ నిర్మించబోతున్నాం. హైదరాబాద్ అభివృద్ధిలో శంషాబాద్ విమానాశ్రయం పోషించిన పాత్రను ఇది పోషిస్తుంది” అని అన్నారు.

**ఐఐటీయన్లకు రెండు విజ్ఞప్తులు**

ఈ సందర్భంగా పాన్ ఐఐటీ కమ్యూనిటీకి లోకేశ్ రెండు విజ్ఞప్తులు చేశారు. “మొదటిది, ప్రపంచాన్ని జయించిన మీ గ్రాడ్యుయేట్ల పరిజ్ఞానాన్ని, మార్గదర్శకత్వాన్ని మా 23 క్లస్టర్ల అభివృద్ధికి

అందించాలి. రెండోది, ‘జుగాడ్’ మోడల్ నుంచి ‘వ్యవస్థీకృత వేగం’ వైపు ఏపీ ప్రయాణించడానికి, ఏఐ సాయంతో మెరుగైన పాలన అందించడానికి మీరంతా సహకరించాలి. ఇతర దేశాల మోడళ్ల గురించి మాట్లాడటం కాదు, భారత్ ఏం చేయగలదో ప్రపంచానికి చూపించాలి. అందుకు ఆంధ్రప్రదేశ్‌ను ఒక ఆదర్శంగా నిలపాలనుకుంటున్నాం” అని లోకేశ్ తన ప్రసంగాన్ని ముగించారు.

## సుప్రీం తీర్పు తర్వాతే మున్సిపల్ ఎన్నికలు

- మొదటి పేజి తరువాయి

రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి నారాయణ స్పందించారు. అమరావతిలో ఈరోజు ఆయన మాట్లాడుతూ, బీసీలకు రిజర్వేషన్లు అమలు చేసేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని, సుప్రీంకోర్టు తీర్పు వెలువడిన తర్వాతే 123 మున్సిపాలిటీలకు ఎన్నికలు నిర్వహిస్తామని స్పష్టం చేశారు.

రాబోయే గోదావరి పుష్కరాలను అత్యంత వైభవంగా నిర్వహించేందుకు ప్రభుత్వం సిద్ధమవుతోందని మంత్రి నారాయణ వివరించారు. ఇందుకోసం సుమారు రూ. 2,000 కోట్లు కేటాయించామని, ఇందులో ఒక్క రాజమండ్రి అభివృద్ధి పనులకే రూ. 1,000 కోట్లు కేటాయించినట్లు పేర్కొన్నారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితి సవాలుగా ఉన్నప్పటికీ, పుష్కరాల నిర్వహణకు నిధుల కొరత లేకుండా చూస్తామని హామీ ఇచ్చారు. గతంలో జల్ జీవన్ మిషన్ కింద మంజూరైన రూ. 5,350 కోట్ల నిధులు వినియోగించుకోకపోవడంతో నిలిచిపోయిన ప్రాజెక్టులను కేంద్రం సహకారంతో పునరుద్ధరిస్తామని తెలిపారు. అమరావతి అభివృద్ధి పనుల గురించి ప్రస్తావిస్తూ, ప్రపంచంలోని ఐదు ఉత్తమ రాజధానుల్లో ఒకటిగా తీర్చిదిద్దే లక్ష్యంతో పనులు ప్రారంభమయ్యాయని అన్నారు. గత ప్రభుత్వం అమరావతి అభివృద్ధిని పూర్తిగా నిర్వీర్యం చేసిందని విమర్శించారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నేతృత్వంలో 2028 చివరి నాటికి నిర్మాణ పనులు పూర్తి చేసేలా చర్యలు తీసుకుంటున్నట్లు వెల్లడించారు. 2027లో 12 రోజుల పాటు జరగనున్న గోదావరి పుష్కరాలకు లక్షలాదిగా భక్తులు వస్తారని అంచనా వేస్తున్న నేపథ్యంలో రోడ్లు, ఘాట్లు, విద్యుత్ సరఫరా వంటి మౌలిక వసతుల పనులను వివిధ శాఖలు సమన్వయంతో చేపడుతున్నాయి.

## అమిత్ షా తెలంగాణ పర్యటన రద్దు..

- మొదటి పేజి తరువాయి

వెల్లడికాలేదు. షెడ్యూల్ ప్రకారం అమిత్ షా నేటి రాత్రి 9 గంటలకు ప్రత్యేక విమానంలో హైదరాబాద్‌లోని బేగంపేట విమానాశ్రయానికి చేరుకుని, లోక్‌భవన్‌లో బస చేయాల్సి ఉంది. ఆదివారం ఉదయం మెదక్, కరీంనగర్ జిల్లాల్లో ఆయన పర్యటిస్తారని.. పలు అభివృద్ధి పనులకు ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనలు చేయడంతో పాటు ఇతర కార్యక్రమాల్లో పాల్గొంటారని షెడ్యూల్ లో పేర్కొన్నారు. హోంమంత్రి పర్యటన కోసం మెదక్, కరీంనగర్ జిల్లాల యంత్రాంగం ఇప్పటికే ఏర్పాట్లు పూర్తి చేసింది. పోలీసులు కూడా భారీ భద్రతా ఏర్పాట్లు చేశారు. అయితే పర్యటన రద్దుకు గల కారణం మాత్రం ఇంకా స్పష్టంగా తెలియలేదు. ఢిల్లీలో అత్యవసర పరిణామాలు లేదా ఇతర అనివార్య కారణాల వల్లే పర్యటన రద్దయి ఉండొచ్చని పార్టీ వర్గాలు చెబుతున్నాయి. పర్యటన రద్దుతో బీజేపీ శ్రేణుల్లో నిరాశ నెలకొంది. అమిత్ షా తెలంగాణకు ఎప్పుడు వస్తారనే విషయాన్ని త్వరలో అధికారికంగా ప్రకటించే అవకాశం ఉంది.

## బీసీ రిజర్వేషన్లపై మాట్లాడే హక్కు వైసీపీకి లేదు

వైసీపీపై కేంద్రమంత్రి రామ్మోహన్ నాయుడు తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. బీసీ రిజర్వేషన్ల అంశంపై మాట్లాడే నైతిక హక్కు వైసీపీకి లేదని ఆయన ధ్వజమెత్తారు. శ్రీకాకుళం జిల్లా పాతపట్నం నియోజకవర్గంలో ఎమ్మెల్యే గోవిందరావుతో కలిసి ‘పల్లె పండుగ 3.0’ కార్యక్రమంలో పాల్గొన్న ఆయన, పలు అభివృద్ధి పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా రామ్మోహన్ నాయుడు మాట్లాడుతూ... బీసీలకు రాజ్యాధికారం దక్కకూడదనే ఉద్దేశంతోనే గతంలో వైసీపీ ప్రభుత్వం రిజర్వేషన్లను అడ్డుకుందని ఆరోపించారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీ కోటాపై గతంలో కోర్టు తీర్పు ఇస్తే, దానిపై అప్పటి జగన్ ప్రభుత్వం ఎందుకు పోరాడలేదని ఆయన ప్రశ్నించారు. బీసీలకు వైసీపీ తీవ్ర అన్యాయం చేసిందని మండిపడ్డారు. ప్రస్తుత కూటమి ప్రభుత్వం స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీ రిజర్వేషన్ల అమలు కోసం సుప్రీంకోర్టులో పోరాటం చేస్తోందని తెలిపారు. గతంలో బీసీలకు 34 శాతం రిజర్వేషన్లు కల్పించిందే తెలుగుదేశం పార్టీ అని గుర్తుచేశారు. బీసీలు ఉన్నత స్థాయిలో ఉండాలన్నదే టీడీపీ లక్ష్యమని స్పష్టం చేశారు. టీడీపీకి బీసీలే వెన్నెముక అని, తమది బీసీల పార్టీ అని అన్నారు. జగన్ అండ్ కో ఆటలు ఇకపై చెల్లవని హెచ్చరించారు.

## 3 లక్షల ఇళ్లకు శంకుస్థాపన..

- మొదటి పేజి తరువాయి

ఈ ప్రాజెక్టును చేపడుతున్నాయి. పైలట్ ప్రాజెక్టు కింద తెనాలి నియోజకవర్గంలోని బుర్రిపాలెం, ఓబులనాయుడు పాలెం గ్రామాల్లో రూ. 14 కోట్ల అంచనా వ్యయంతో 177 ఇళ్లను నిర్మించనున్నారు. ఈ అత్యాధునిక టెక్నాలజీ ద్వారా అత్యంత వేగంగా, తక్కువ శ్రమతో నిర్మాణం పూర్తి చేయడం, నిర్మాణ వ్యర్థాలను తగ్గించడం, నాణ్యత, పటిష్ఠతను పెంచడం సాధ్యమవుతుందని అధికారులు వివరిస్తున్నారు.

**ముఖ్యమంత్రి పర్యటన వివరాలు**

సీఎం చంద్రబాబు ఆదివారం ఉదయం 10:15 గంటలకు ఉండవల్లిలోని క్యాంపు కార్యాలయం నుంచి బయలుదేరి 10:35 గంటలకు బుర్రిపాలెం చేరుకుంటారు. ఉదయం 10:40 గంటలకు 3డీ ఇళ్ల నిర్మాణ పైలట్ ప్రాజెక్టుకు భూమిపూజ చేసి, అనంతరం లబ్ధిదారులతో సమావేశమవుతారు. 11:10 గంటలకు అక్కడ ఏర్పాటు చేసిన బహిరంగ సభలో ప్రసంగిస్తారు. పర్యటన ముగించుకుని మధ్యాహ్నం 1:35 గంటలకు తిరిగి క్యాంపు కార్యాలయానికి చేరుకుంటారు.

## యూపీలో కాంగ్రెస్‌కు 50 సీట్లు కూడా ఎక్కువే

ఉత్తర్‌ప్రదేశ్ అసెంబ్లీ ఎన్నికలకు ముందే సమాజ్‌వాదీ పార్టీ (ఎస్పీ), కాంగ్రెస్ మధ్య సీట్ల పంపకంపై మాటల యుద్ధం మొదలైంది. కాంగ్రెస్ కనీసం 150 స్థానాల్లో పోటీ చేయాలని చెబుతుండగా.. 50 సీట్లు కూడా ఎక్కువేనని ఎస్పీ ఎంపీ శివ్‌పాల్ సింగ్ పటేల్ అన్నారు. కాంగ్రెస్ తన బలాన్ని బట్టి సీట్లు కోరాలని సూచించారు. కాంగ్రెస్‌కు 50 సీట్లు ఇస్తేనే పెద్ద విషయమని పటేల్ వ్యాఖ్యానించారు. ప్రస్తుతం ఉత్తర్‌ప్రదేశ్‌లో కాంగ్రెస్‌కు ఇద్దరు ఎమ్మెల్యేలు మాత్రమే ఉన్నారని గుర్తు చేశారు. రెండు పార్టీలు కలిసి పోటీ చేస్తే కాంగ్రెస్‌కు ప్రయోజనం ఉంటుందని అన్నారు. కాంగ్రెస్ మాత్రం 150 సీట్లకు తగ్గకుండా పోటీ చేయాలని ఇప్పటికే తన వైఖరిని స్పష్టం చేసింది. యూపీ కాంగ్రెస్ ఇన్‌ఛార్జి రాజేంద్ర పాల్ గౌతమ్ ఈ విషయాన్ని ఇటీవల ప్రకటించారు. 403 అసెంబ్లీ స్థానాల్లో సగం సీట్లపై తమకు హక్కు ఉందని ఆయన పేర్కొన్నారు. సీట్ల పంపకంపై

చర్చలు అక్టోబర్‌లో జరిగే అవకాశం ఉంది. సీట్ల విషయంలో ఏకాభిప్రాయం కుదరకపోతే పొత్తు ఉద్దేశమే దెబ్బతింటుందని పటేల్ అన్నారు. తుది నిర్ణయం ఎస్పీ అధ్యక్షుడు అఖిలేశ్ యాదవ్ తీసుకుంటారని చెప్పారు. కాంగ్రెస్ ఎంపీ ఇమ్రాన్ మసూద్ మాత్రం తమ పార్టీ నాయకత్వం తీసుకునే నిర్ణయానికే కట్టుబడి ఉంటామని తెలిపారు. ఎస్పీ, కాంగ్రెస్ 2024 లోక్‌సభ ఎన్నికల్లో యూపీలో కలిసి పోటీ చేశాయి. ఆ ఎన్నికల్లో ఎస్పీ 37, కాంగ్రెస్ 6 లోక్‌సభ స్థానాలు గెలిచాయి.

## అంతా బాగుందనుకుంటే ప్రమాదమే..
### రానున్న ఆర్థిక సవాళ్లపై ఆర్‌బీఐ గవర్నర్ వార్నింగ్

- మొదటి పేజి తరువాయి

కోవిడ్ తర్వాత ప్రపంచం ఎన్నో ఆర్థిక, ఇతర సంక్షోభాలను ఎదుర్కొందని మల్హోత్రా తెలిపారు. అయినా ప్రపంచ ఆర్థిక వ్యవస్థ వాటిని తట్టుకుని నిలబడిందన్నారు. భారత్‌లోనూ చాలాకాలంగా ఆర్థిక పరిస్థితులు స్థిరంగా ఉన్నాయని చెప్పారు.

అయితే ఇదే స్థిరత్వం మరో సమస్యకు దారి తీయొచ్చని ఆయన హెచ్చరించారు. చాలాకాలం ఎలాంటి పెద్ద సంక్షోభం రాకపోతే గతంలో ఎదురైన సమస్యలను ప్రజలు, సంస్థలు మర్చిపోతారని అన్నారు. దీంతో ఎక్కువ రిస్క్ తీసుకోవడం, భారీగా అప్పులు చేయడం పెరిగే అవకాశం ఉందని చెప్పారు.

**ఒక్కసారిగా సమస్యలు రావొచ్చు**

బ్యాంకింగ్, ఆర్థిక రంగాల్లో సమస్యలు ఒక్కసారిగా బయటపడే అవకాశం ఉందని మల్హోత్రా తెలిపారు. అయితే వాటిని పూర్తిగా పరిష్కరించడానికి మాత్రం చాలా సమయం పడుతుందని చెప్పారు. అందుకే పరిస్థితులు బాగున్న సమయంలోనే జాగ్రత్తగా ఉండాలని సూచించారు. ప్రపంచ ఆర్థిక వ్యవస్థను గతంలో నడిపించిన విధానాల్లో ఇప్పుడు మార్పులు వస్తున్నాయని ఆయన పేర్కొన్నారు. దేశాల మధ్య రాజకీయ, ఆర్థిక విభేదాలు పెరుగుతున్నాయని చెప్పారు. వాణిజ్య ఆంక్షలు, సరఫరా అంతరాయాలు కూడా తరచూ ఎదురవుతున్నాయని తెలిపారు. ఈ మార్పులన్నీ ఒకదానితో ఒకటి కలిసి ప్రభావం చూపుతున్నాయని మల్హోత్రా అన్నారు. అందువల్ల కేంద్ర బ్యాంకులు కేవలం ద్రవ్యోల్బణం, ఆర్థిక స్థిరత్వంపైనే దృష్టి పెట్టకుండా ప్రపంచ పరిణామాలను కూడా గమనించాలని సూచించారు.

## ధర్మవరం నుండి శబరిమలకు అయ్యప్ప స్వాముల పాదయాత్ర.




**కిర్లంపూడి/ప్రత్తిపాడు, పెన్ పవర్, 03:**కాకినాడ జిల్లా ప్రత్తిపాడు మండలం ధర్మవరం నుండి శబరిమల శ్రీ అయ్యప్ప స్వామి వ సన్నిధికి 8 మంది అయ్యప్ప స్వాములు భక్తిశ్రద్ధలతో శనివారం పాదయాత్ర ప్రారంభించారు.ఈ పవిత్ర పాదయాత్రను దండపాణి గురుస్వామి కుమారుడు, పూజ్య గురువులు వేలుగురు స్వామి చేతుల మీదుగా ప్రారంభించారు.ఈ కార్యక్రమంలో ధర్మవరం గురుస్వామి డాక్టర్ గంగాధర్ గురు స్వామి అయ్యప్ప స్వాముల బృందం మరియు భవానీ స్వాముల బృందం పాల్గొని పాదయాత్రను భక్తిశ్రద్ధలతో ప్రారంభించారు.శ్రీ అయ్యప్ప స్వామి వారి దివ్య అనుగ్రహంతో ఈ పాదయాత్ర విజయవంతంగా సాగి, స్వామి వారి దర్శనం అందరికీ కలగాలని ప్రార్థించారు.

పెన్ పవర్
కాకినాడ
డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ కోనసీమ జిల్లా

# స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణకు సన్నద్ధంగా ఉండాలి





- ✸ స్ట్రాంగ్ రూములు, కౌంటింగ్ కేంద్రాలపై ప్రత్యేక దృష్టి
- ✸ సిబ్బందికి ముందుగానే శిక్షణ
- ✸ జిల్లా కలెక్టర్ ఎం.ఎన్. హరేంధిర ప్రసాద్

**కాకినాడ, పెన్ పవర్, అక్టోబర్ 3:**త్వరలో స్థానిక సంస్థల ఎన్నికలకు నోటిఫికేషన్ విడుదల కానున్న నేపథ్యంలో ఎన్నికల నిర్వహణకు సంబంధిత అధికారులు పూర్తి స్థాయిలో సన్నద్ధంగా ఉండాలని జిల్లా కలెక్టర్ ఎం.ఎన్. హరేంధిర ప్రసాద్ ఆదేశించారు. ఎన్నికల నిర్వహణలో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అవసరమైన అన్ని ఏర్పాట్లను ముందుగానే పూర్తి చేయాలని సూచించారు.శనివారం కాకినాడ కలెక్టరేట్‌లో మున్సిపల్ కమిషనర్లు, జిల్లా పరిషత్ సీఈవో, డిప్యూటీ సీఈవో, జిల్లా పంచాయతీ అధికారులతో స్థానిక సంస్థల ఎన్నికల సన్నద్ధతపై కలెక్టర్ సమీక్ష సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ కాకినాడ నగరపాలక సంస్థ ఎన్నికల నిర్వహణకు సంబంధించి అవసరమైన క్లియరెన్స్ రావాల్సి ఉందన్నారు. తుని, పిఠాపురం, గొల్లప్రోలు, పెద్దాపురం, సామర్లకోట పురపాలక సంఘాల్లో వార్డు కౌన్సిలర్లు, చైర్మన్ ఎన్నికల నిర్వహణకు అధికారులు అన్ని విధాలుగా సిద్ధంగా ఉండాలని ఆదేశించారు.ఎన్నికల సామగ్రి, బ్యాలెట్ పత్రాలు, బ్యాలెట్ బాక్సుల భద్రత కోసం అవసరమైన ప్రాంతాల్లో పటిష్టమైన స్ట్రాంగ్ రూములను ముందుగానే గుర్తించాలని కలెక్టర్ సూచించారు. కౌంటింగ్ నిర్వహణకు విశాలమైన హాళ్లను ఎంపిక చేసి, అవసరమైన మౌలిక సదుపాయాలు కల్పించాలన్నారు. స్ట్రాంగ్ రూముల్లో డబుల్ లాక్ విధానం అమలు చేయడంతో పాటు భద్రతా ఏర్పాట్లను పటిష్టంగా చేపట్టాలని ఆదేశించారు.గ్రామ పంచాయతీల పరిధిలో వార్డు సభ్యులు, సర్పంచులు, ఎంపీటీసీలు, జడ్పీటీసీల ఎన్నికల నిర్వహణకు సంబంధించి కూడా అవసరమైన ఏర్పాట్లను పూర్తి చేయాలని తెలిపారు. కౌంటింగ్‌కు ముందు బ్యాలెట్ పత్రాలను క్రమబద్ధంగా బండ్లింగ్ చేసే ప్రక్రియను చేపట్టాలని, వార్డు సభ్యులు, చైర్మన్ తదితర ఎన్నికల కౌంటింగ్ కోసం అవసరమైన మేరకు వేర్వేరు హాళ్లను ఎంపిక చేయాలని సూచించారు.ఎన్నికల సామగ్రి రవాణాకు అవసరమైన వాహనాలను ముందుగానే గుర్తించి సమగ్ర రవాణా ప్రణాళికను సిద్ధం చేయాలని కలెక్టర్ ఆదేశించారు. రహదారులు, సెక్టార్లు, జోన్ల విభజన తదితర అంశాలపై ప్రత్యేక దృష్టి సారించాలని తెలిపారు. ఎన్నికల సామగ్రి పంపిణీ, రిసెప్షన్ ప్రక్రియలను పకడ్బందీగా నిర్వహించేందుకు కార్యాచరణ సిద్ధం చేయాలన్నారు.అవసరమైన సంఖ్యలో బ్యాలెట్ బాక్సులను ముందుగానే సమకూర్చుకోవాలని సూచించారు. పంచాయతీల్లో పోలింగ్, కౌంటింగ్ ప్రక్రియ పూర్తయిన అనంతరం బ్యాలెట్ బాక్సులను సంబంధిత ట్రెజరీల్లో భద్రపరిచేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఎన్నికల సామగ్రిని పోలీస్ ఎస్కార్ట్, బందోబస్తు నడుమ సురక్షితంగా తరలించాలని ఆదేశించారు.పోలింగ్ కేంద్రాల్లోని ఓటర్ల సంఖ్యను ప్రాతిపదికగా తీసుకుని తగిన సంఖ్యలో పోలింగ్ సిబ్బందిని నియమించాలని కలెక్టర్ తెలిపారు. కౌంటింగ్ సిబ్బందిని కూడా ముందుగానే ఎంపిక చేసి వారికి అవసరమైన శిక్షణ అందించాలన్నారు. మాస్టర్ ట్రైనర్ల ద్వారా శిక్షణ కార్యక్రమాలను సమర్థవంతంగా నిర్వహించి, ఎన్నికల విధులపై సిబ్బందికి పూర్తి అవగాహన కల్పించాలని సూచించారు.ఎన్నికల నిర్వహణకు సంబంధించిన ప్రతి అంశంపై ముందస్తు ప్రణాళికతో పనిచేయాలని,ఎన్నికల సంఘం మార్గదర్శకాలను ఖచ్చితంగా పాటిస్తూ సమన్వయంతో వ్యవహరించాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. ఈ నెల 7న రాష్ట్ర ఎన్నికల అధికారి నిర్వహించే సమావేశం నేపథ్యంలో సంబంధిత అంశాలపై అధికారులు పూర్తి సమాచారంతో సిద్ధంగా ఉండాలని తెలిపారు.ఈ సమావేశంలో నగరపాలక సంస్థ మున్సిపల్ కమిషనర్ ఎన్.వి.వి. సత్యనారాయణ,జిల్లా పరిషత్ సీఈవో వి.వి.వి.ఎస్.లక్ష్మణరావు,డిప్యూటీ సీఈవో శ్రీలలిత, జిల్లా పంచాయతీ అధికారి పి.రవికుమార్,మున్సిపల్ కమిషనర్లు రాజేశ్వరరావు,కనకారావు, వెంకట్రావు,దేవిజా సంపత్,శ్రీకాంత్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## రామచంద్రపురం పట్టణంలో రూ.15.27 లక్షల అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు





- ✸ మంత్రి సుభాష్ కృషితో వేగవంతంగా నియోజకవర్గ అభివృద్ధి
- ✸ కూటమి పార్టీ సీనియర్ నాయకులు వాసంశెట్టి సత్యం

**రామచంద్రపురం, పెన్ పవర్,అక్టోబర్ 3:**రామచంద్రపురం పట్టణంలోని వివిధ వార్డుల్లో రూ.15.27 లక్షలతో చేపట్టనున్న అభివృద్ధి పనులకు కూటమి పార్టీ సీనియర్ నాయకులు వాసంశెట్టి సత్యం, మున్సిపల్ కమిషనర్ కేవీఆర్ఆర్ రాజు, ఏఎంసీ చైర్మన్ అక్కల రిశ్వంత్ రాయ్, జనసేన ఇన్‌చార్జి పోలిశెట్టి చంద్రశేఖర్ కూటమి నాయకులతో కలిసి శంకుస్థాపనలు చేశారు.ఈ సందర్భంగా వాసంశెట్టి సత్యం మాట్లాడుతూ రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ ప్రత్యేక చొరవతో రామచంద్రపురం పట్టణంలో మౌలిక సదుపాయాల అభివృద్ధికి ప్రాధాన్యం ఇస్తున్నట్లు తెలిపారు. రహదారులు, డ్రైనేజీలు, పారిశుధ్య సదుపాయాల కల్పన ద్వారా ప్రజలకు మెరుగైన వసతులు అందించేందుకు అభివృద్ధి పనులు చేపడుతున్నట్లు పేర్కొన్నారు.మంత్రి సుభాష్ నాయకత్వంలో ఇప్పటికే రామచంద్రపురం పట్టణంలో పలు అభివృద్ధి పనులు పూర్తయ్యాయని, ప్రస్తుతం మరో విడతలో వివిధ వార్డుల్లో సీసీ రోడ్లు, సీసీ డ్రైన్ల నిర్మాణానికి శ్రీకారం చుట్టినట్లు తెలిపారు. ప్రజలకు అవసరమైన మౌలిక వసతులు కల్పించడమే లక్ష్యంగా అభివృద్ధి పనులు కొనసాగుతున్నాయని చెప్పారు.

**వార్డుల వారీగా చేపట్టనున్న పనులు:**

- 16వ వార్డు -- చప్పిడివారి సవరం: డోర్ నంబర్ 32-2-11 నుంచి 32-2-9/21 వరకు సీసీ రోడ్డు నిర్మాణానికి రూ.2.35 లక్షలు, అదే ప్రాంతంలో సీసీ డ్రైన్ నిర్మాణానికి రూ.0.41 లక్షలు.
- 13వ వార్డు -- బ్రాడిపేట-2 సచివాలయం పరిధి: డోర్ నంబర్ 31-2-28/21 నుంచి 31-2-8/39 వరకు సీసీ రోడ్డు నిర్మాణానికి రూ.2.94 లక్షలు, సీసీ డ్రైన్‌కు రూ.0.23 లక్షలు.
- 11వ వార్డు -- పైడారావు వీధి: డోర్ నంబర్ 31-2-5/7 నుంచి 31-3-6 వరకు సీసీ రోడ్డు నిర్మాణానికి రూ.1.64 లక్షలు, సీసీ డ్రైన్‌కు రూ.0.81 లక్షలు.
- 3వ వార్డు -- అంకంవారి వీధి: డోర్ నంబర్ 14-2-61/6 నుంచి జెట్టి రాము ఇంటి వరకు సీసీ రోడ్డు నిర్మాణానికి రూ.1.97 లక్షలు, సీసీ డ్రైన్‌కు రూ.1.08 లక్షలు.
- 1వ వార్డు -- కొత్తూరు: కమ్యూనిటీ టాయిలెట్ల నుంచి సాయిబాబా ఆలయం వరకు సీసీ డ్రైన్ నిర్మాణానికి రూడా గ్రాంట్ కింద రూ.3.84 లక్షలు.15వ ఆర్థిక సంఘం, రూడా గ్రాంట్‌ల ద్వారా చేపట్టనున్న ఈ అభివృద్ధి పనుల మొత్తం విలువ రూ.15.27 లక్షలుగా అధికారులు తెలిపారు.ఈ సందర్భంగా ఏఎంసీ చైర్మన్ అక్కల రిశ్వంత్ రాయ్, జనసేన ఇన్‌చార్జి పోలిశెట్టి చంద్రశేఖర్ మాట్లాడుతూ పట్టణంలోని ప్రజల అవసరాలను గుర్తించి అభివృద్ధి పనులకు నిధులు సమకూర్చి పనులు అమలు చేస్తున్నట్లు తెలిపారు. ప్రతి వార్డులో మౌలిక సదుపాయాల కల్పనకు ప్రాధాన్యం ఇస్తూ పట్టణ అభివృద్ధికి కృషి చేస్తున్నామని చెప్పారు.కార్యక్రమంలో మున్సిపల్ డీఈ శ్రీకాంత్, ఏఈ సునీల్, కూటమి నాయకులు, మున్సిపల్ అధికారులు, ఆయా వార్డుల నాయకులు, పెద్దలు, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

## వికసిత్ భారత్ లక్ష్య సాధనలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలి






ప్రభుత్వ విప్ యనమల దివ్య పిలుపు

**పెన్ పవర్ బ్యూరో కాకినాడ(తుని,) అక్టోబర్ 03:** 2047 నాటికి భారతదేశాన్ని అభివృద్ధి చెందిన దేశంగా తీర్చిదిద్దే లక్ష్యంతో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ముందుకు సాగుతున్నాయని ప్రభుత్వ విప్ యనమల దివ్య అన్నారు. 'వికసిత్ భారత్ 2047' లక్ష్య సాధనలో ప్రజలందరూ భాగస్వాములు కావాలని ఆమె పిలుపునిచ్చారు.తుని మండలం తేటగుంటలోని క్యాంపు కార్యాలయంలో సీనియర్ నేత యనమల రాజేష్‌తో కలిసి ఆమె 'సేవా జ్యోతి యాత్ర'ను ప్రారంభించారు. ఈ సందర్భంగా యనమల దివ్య మాట్లాడుతూ ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నాయకత్వంలో దేశ అభివృద్ధికి యువత సేవాభావంతో ముందుకు రావాలని సూచించారు.యువతలో దేశభక్తి, స్వచ్ఛత, సామాజిక బాధ్యతపై మరింత అవగాహన పెంపొందించాల్సిన అవసరం ఉందన్నారు. సమాజ అభివృద్ధిలో ప్రతి ఒక్కరూ తమ వంతు బాధ్యతను నిర్వర్తించినప్పుడే వికసిత్ భారత్ లక్ష్యం సాకారమవుతుందని పేర్కొన్నారు.

దేశ ప్రగతిలో ప్రజల భాగస్వామ్యం కీలకమని, సేవా కార్యక్రమాల ద్వారా సామాజిక చైతన్యాన్ని పెంపొందించాలని యనమల దివ్య కోరారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



## గ్రామాల్లో మౌలిక సదుపాయాల కల్పనకు కూటమి ప్రభుత్వం ప్రత్యేక కృషి.

✸ ప్రత్తిపాడు ఎమ్మెల్యే వరపుల సత్యప్రభరాజా.

**కిర్లంపూడి/ప్రత్తిపాడు, పెన్ పవర్, అక్టోబర్, 03:** గ్రామాల్లో మౌలిక సదుపాయాల కల్పనకు కూటమి ప్రభుత్వం ప్రత్యేక కృషి చేస్తుందని ప్రత్తిపాడు ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభరాజా అన్నారు.శనివారం ప్రత్తిపాడు మండలం,ఒమ్మంగి గ్రామంలో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం-పంచాయితీరాజ్, గ్రామీణభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో పల్లె పండుగ 3.0 లో భాగంగా వి. బి. జి. రామ్. జి నిధులతో సుమారు 20 లక్షల రూపాయిల వ్యయంతో నిర్మించనున్న నూతన సీసీ రోడ్డు నిర్మాణానికి ప్రత్తిపాడు ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభరాజా శంకుస్థాపన చేశారు.ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యేతోపాటు పలువురు మండల కూటమి నాయకులు, కార్యకర్తలు, అధికారులు పాల్గొన్నారు.

## రూ.5.30 కోట్లతో స్కిల్స్, స్టార్టప్స్, భారత్ హబ్





స్కిల్ సెంటర్ శంకుస్థాపనకు సర్వం సిద్ధం

**కాకినాడ రూరల్, పెన్ పవర్, అక్టోబర్ 3:**కాకినాడ జిల్లా యువతకు ఆధునిక నైపుణ్యాలను అందించడంతో పాటు, స్టార్టప్ ఆలోచనలు, ఆవిష్కరణలకు ప్రోత్సాహం కల్పించే లక్ష్యంతో ఏర్పాటు చేయనున్న "స్కిల్స్, స్టార్టప్స్, భారత్ హబ్ -- స్కిల్ సెంటర్" శంకుస్థాపనకు ఏర్పాట్లు పూర్తయ్యాయి.కాకినాడ నగరంలోని ప్రభుత్వ ఐటీఐ కళాశాల ప్రాంగణంలో తొలి దశలో సుమారు రూ.5.30 కోట్ల రాజ్యసభ ఎంపీ ల్యాడ్స్ నిధులతో ఈ స్కిల్ సెంటర్‌ను అభివృద్ధి చేయనున్నారు. మారుతున్న సాంకేతిక పరిజ్ఞానం, పరిశ్రమల అవసరాలకు అనుగుణంగా యువతకు నైపుణ్య శిక్షణ అందించడంతో పాటు ఉద్యోగ అవకాశాలు, స్టార్టప్‌లు, ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్ వైపు వారిని ప్రోత్సహించేలా కేంద్రాన్ని తీర్చిదిద్దనున్నారు.రాజ్యసభ సభ్యులు సానా సతీష్ బాబు ఈ నెల 5వ తేదీ సోమవారం ఉదయం 11.45 గంటలకు స్కిల్ సెంటర్ శిలాఫలకాన్ని ఆవిష్కరించి శంకుస్థాపన చేయనున్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ ఎం.ఎన్. హరేంధిర ప్రసాద్, కాకినాడ ఎంపీ తంగెళ్ల ఉదయ్ శ్రీనివాస్, జిల్లా ఎమ్మెల్యేలు, ప్రజాప్రతినిధులు, అధికారులు తదితరులు పాల్గొననున్నారు.యువతకు కేవలం శిక్షణ అందించడమే కాకుండా వారి నైపుణ్యాలను పరిశ్రమల అవసరాలతో అనుసంధానం చేయడం, సృజనాత్మక ఆలోచనలకు ప్రోత్సాహం అందించడం, స్టార్టప్ అవకాశాలకు మార్గం చూపడం ఈ కేంద్రం ప్రధాన ఉద్దేశ్యంగా పేర్కొన్నారు.కాగా కాకినాడ ప్రభుత్వ ఐటీఐ కళాశాల ప్రాంగణంలో స్కిల్స్, స్టార్టప్స్, భారత్ హబ్ -- స్కిల్ సెంటర్ శంకుస్థాపన కార్యక్రమానికి సంబంధించిన ఏర్పాట్లు కొనసాగుతున్నాయి.

## స్వచ్ఛ ఆంధ్ర అవార్డు గ్రహీత వాసంశెట్టి సత్యంకు ఘన సత్కారం



**రామచంద్రపురం, పెన్ పవర్ అక్టోబర్ 3 :** స్వచ్ఛ ఆంధ్ర--2026 అవార్డు గ్రహీత,సత్యం వాసంశెట్టి ఫౌండేషన్ చైర్మన్ వాసంశెట్టి సత్యంను రామచంద్రపురం పట్టణ ప్రముఖులు, పలు గ్రామాల నాయకులు,ప్రజలు శనివారం ఘనంగా సత్కరించారు. మహాత్మా గాంధీ జయంతిని పురస్కరించుకొని డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ కోనసీమ జిల్లా కలెక్టర్ మహేష్ కుమార్ చేతుల మీదుగా ఉత్తమ ఎన్జీవోగా స్వచ్ఛ ఆంధ్ర--2026 అవార్డును వాసంశెట్టి సత్యం అందుకున్న విషయం తెలిసిందే.ఈ సందర్భంగా రామచంద్రపురం నియోజకవర్గంలోని మంజేరు,శీల, శీలంక,ఒంటితాడి,వెల్ల గ్రామాలకు చెందిన నాయకులు,ప్రజలు వాసంశెట్టి సత్యంను మర్యాదపూర్వకంగా కలిసి దుశ్శాలువాలు, పూలమాలలతో ఘనంగా సత్కరించారు.సత్యం వాసంశెట్టి ఫౌండేషన్ ద్వారా,మంత్రి వాసంశెట్టి సుభాష్ సహకారంతో నిర్వహిస్తున్న వివిధ సామాజిక సేవా కార్యక్రమాలను వారు ప్రశంసించారు. ఫౌండేషన్ ద్వారా ఒకవైపు, మంత్రి వాసంశెట్టి సుభాష్ ప్రభుత్వపరంగానే కాకుండా వ్యక్తిగతంగా,సీఎస్ఆర్ నిధులను సమీకరించి నియోజకవర్గ అభివృద్ధి, ప్రజా సేవకు చేస్తున్న కృషి అభినందనీయమని వారు పేర్కొన్నారు. ప్రజల సంక్షేమం కోసం చేస్తున్న సేవలను ఎప్పటికీ మరచిపోలేమని అన్నారు.ఈ కార్యక్రమంలో జల్లి సత్యనారాయణ, దడాల నాగార్జున,కునపరెడ్డి శివతేజ, గుండారపు శ్రీనివాస్,ఆకుల నారాయణరావు,కూటమి కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## రాష్ట్ర స్థాయి పరీక్షల్లో కాకినాడ జిల్లా కె9 బృందానికి ప్రథమ స్థానాలు



**కాకినాడ, పెన్ పవర్ అక్టోబర్ 3 :** రాష్ట్ర స్థాయి పరీక్షల్లో అత్యుత్తమ ప్రతిభ కనబరిచి ప్రథమ స్థానాలు సాధించిన కాకినాడ జిల్లా పోలీసు శాఖకు చెందిన కె9 బృందాన్ని జిల్లా ఎస్పీ జి. బిందు మాధవ్ అభినందించారు. విజయవాడ--మంగళగిరి 6వ బెటాలియన్‌లోని ఐఎస్‌డబ్ల్యు డాగ్ ట్రైనింగ్ సెంటర్‌లో 23వ బ్యాచ్‌కు చెందిన కె9 బృందాలు 10 నెలల కఠిన శిక్షణను విజయవంతంగా పూర్తి చేసుకుని ఈ ఘనత సాధించాయి.శిక్షణలో భాగంగా నిర్వహించిన రాష్ట్ర స్థాయి పరీక్షల్లో పేలుడు పదార్థాల గుర్తింపు విభాగంలో డాగ్ లియో, హ్యాండ్లర్ ఎన్.డి.దినేష్ నాయుడు,స్పేర్ హ్యాండ్లర్ ఎం.గంగాధర్ రావు ప్రథమ స్థానంలో నిలిచారు.అలాగే మాదక ద్రవ్యాల గుర్తింపు విభాగంలో డాగ్ ర్యాండీ, హ్యాండ్లర్ రాజేష్, స్పేర్ హ్యాండ్లర్ ఎం. శివ శంకర్ ప్రథమ స్థానాన్ని సాధించారు.10 నెలల కఠిన శిక్షణ అనంతరం కాకినాడ జిల్లాకు తిరిగి వచ్చిన కె9 బృందాన్ని ఎస్పీ జి. బిందు మాధవ్ ప్రత్యేకంగా అభినందించారు. బృంద సభ్యుల కృషి,అంకితభావం, క్రమశిక్షణతో పాటు శిక్షణలో కనబరిచిన ప్రతిభను ప్రశంసించారు.రాష్ట్ర స్థాయిలో ప్రథమ స్థానాలు సాధించడం కాకినాడ జిల్లా పోలీసులకు గర్వకారణమని పేర్కొంటూ, భవిష్యత్తులోనూ ఇదే స్ఫూర్తి, అంకితభావంతో విధుల్లో రాణించాలని ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీ (అడ్మిన్) డాక్టర్ మహంతి కిషోర్ కుమార్, ఎస్బీ డీఎస్పీ కె.వి.వి.సత్యనారాయణ, ఏఆర్ అదనపు ఎస్పీ శ్రీనివాసరావు,ఏఆర్ డీఎస్పీ వి.జి.శ్రీహరిరావు,ఎంటీ ఆర్ఐ నరసింహమూర్తి,పోలీసు సిబ్బంది పాల్గొని కె9 బృందాన్ని అభినందించారు.

## విఘ్నేశ్వరుడి సన్నిధిలో సాత్విక్ సాయిరాజ్

ఆలయ మర్యాదలతో ఘన స్వాగతం.. ప్రత్యేక పూజలు



**అయినవిల్లి పెన్ పవర్ అక్టోబర్ 3:** భారత బ్యాడ్మింటన్ క్రీడాకారుడు, ఖేల్‌రత్న, అర్జున అవార్డు గ్రహీత రంకిరెడ్డి సాత్విక్ సాయిరాజ్ శనివారం అయినవిల్లి శ్రీ విఘ్నేశ్వర స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయానికి చేరుకున్న సాత్విక్ సాయిరాజ్‌కు ఆలయ అధికారులు, అర్చకులు ఆలయ మర్యాదలతో ఘన స్వాగతం పలికారు.అనంతరం స్వామివారి సన్నిధిలో ప్రధాన అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహించి వేద ఆశీర్వచనం అందజేశారు. ఆలయ చైర్మన్ విల్లా సూర్యనారాయణ, ఈవో ముదునూరి సత్యనారాయణరాజు స్వామివారి శేషవస్త్రాలతో సాత్విక్ సాయిరాజ్‌ను సత్కరించారు. తీర్థప్రసాదాలు అందజేసి స్వామివారి ఆశీస్సులు అందించారు.ఈ సందర్భంగా ఆలయ అర్చకులు అయినవిల్లి విఘ్నేశ్వర స్వామివారి క్షేత్ర మహత్యం, ఆలయ విశిష్టతను సాత్విక్ సాయిరాజ్‌కు వివరించారు. స్వామివారి దర్శనం అనంతరం ఆయన ఆలయ పరిసరాలను సందర్శించారు. ప్రముఖ బ్యాడ్మింటన్ క్రీడాకారుడు సాత్విక్ సాయిరాజ్ ఆలయానికి రావడంతో అక్కడి భక్తులు, ఆలయ సిబ్బంది ఆసక్తి కనబరిచారు.

# వాడపాలెంలో వైభవంగా అంగన్‌వాడీ ఉత్సవం






**కొత్తపేట, పెన్ పవర్, అక్టోబర్ 3:** గర్భిణులు, బాలింతలు, చిన్నారులు పౌష్టికాహారం తీసుకోవడం ద్వారా ఆరోగ్యాన్ని కాపాడుకోవచ్చని ఐసీడీఎస్ అధికారులు సూచించారు. సేవా సంకల్ప అభియాన్‌లో భాగంగా, ప్రధానమంత్రి నరేంద్ర మోదీ 25 సంవత్సరాల ప్రజాసేవను పూర్తిచేసుకున్న సందర్భంగా శనివారం వాడపాలెం కాపు కల్యాణ మండపంలో కొత్తపేట ఐసీడీఎస్ పరిధిలో అంగన్‌వాడీ ఉత్సవ్, పోషణ మాసం కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు.కార్యక్రమానికి కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు సతీమణి బండారు కమలారాణి, కొత్తపేట జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జ్ బండారు శ్రీనివాస్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా గర్భిణులకు సీమంతాలు నిర్వహించి, తల్లి, శిశు ఆరోగ్య పరిరక్షణపై అవగాహన కల్పించారు. గర్భిణులు, బాలింతలు, చిన్నారులు తప్పనిసరిగా పోషక విలువలున్న ఆహారం తీసుకోవాలని, ఆరోగ్య నియమాలను పాటించాలని అధికారులు సూచించారు.తృణధాన్యాలు, ఆకుకూరలు, వివిధ పౌష్టికాహార వంటకాలతో ఏర్పాటు చేసిన ప్రదర్శన ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా ప్రభుత్వం అందిస్తున్న పౌష్టికాహారాన్ని అర్హులైన వారు సద్వినియోగం చేసుకోవాలని పిలుపునిచ్చారు. తల్లి, బిడ్డల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించడంతో పాటు పోషకాహార లోపాన్ని నివారించడమే ఇటువంటి కార్యక్రమాల ప్రధాన ఉద్దేశమని తెలిపారు.కార్యక్రమంలో ఐసీడీఎస్ సీడీపీఓ గజలక్ష్మి, సూపర్‌వైజర్లు, అంగన్‌వాడీ కార్యకర్తలు, కూటమి నాయకులు, కార్యకర్తలు, గర్భిణులు, బాలింతలు, చిన్నారులు తదితరులు పాల్గొన్నారు.

# వాడపల్లి వెంకన్న సన్నిధిలో భక్తజన సందడి





### ఏడు వారాల నోములతో భక్తుల ఆధ్యాత్మిక సందడి.. సినీనటుడు జీవన్‌కుమార్ దర్శనం

**ఆత్రేయపురం పెన్ పవర్ అక్టోబర్ 3:** కోనసీమ తిరుమలగా విరాజిల్లుతున్న వాడపల్లి శ్రీ వేంకటేశ్వర స్వామివారి దర్శనానికి తెలుగు రాష్ట్రాల నలుదిక్కుల నుంచి భక్తులు శనివారం వేలాదిగా తరలివచ్చారు. వేకువజాము నుంచే ఆలయ పరిసరాలు భక్తుల రాకతో కిక్కిరిశాయి. ఏడు వారాల నోము నోచుకునే భక్తులు సంప్రదాయ దుస్తులు ధరించి గౌతమీ గోదావరిలో పుణ్యస్నానాలు ఆచరించి ఆలయ మాడవీధుల్లో ఏడు ప్రదక్షిణలు నిర్వహించారు. అనంతరం క్యూలైన్ల ద్వారా స్వామివారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు.

వైభవంగా స్వామివారి మేలుకొలుపు

ఆలయ సన్నిధిలో వేకువజామున స్వామివారి మేలుకొలుపు సేవ, ఐశ్వర్యలక్ష్మీ హోమం, అలంకరణోత్సవం, సుప్రభాత సేవలను ఆలయ అర్చకులు శాస్త్రోక్తంగా నిర్వహించారు. అనంతరం స్వామివారికి నిర్వహించిన తొలి హారతి దర్శనానికి భక్తులు అధిక సంఖ్యలో హాజరై భక్తిపారవశ్యంలో మునిగిపోయారు. స్వామివారి నామస్మరణతో ఆలయ ప్రాంగణం మార్మోగింది.

**ఏడు వారాల నోముతో భక్తుల ప్రదక్షిణలు**

వాడపల్లి వెంకటేశ్వర స్వామివారిని ఏడు వారాలు దర్శించుకుని, ఏడు ప్రదక్షిణలు నిర్వహించడం విశేషమైన ఆధ్యాత్మిక సంప్రదాయంగా భక్తులు భావిస్తున్నారు. ఇందులో భాగంగా శనివారం పెద్ద సంఖ్యలో భక్తులు తెల్లవారుజామునే గౌతమీ గోదావరిలో స్నానమాచరించి ఆలయానికి చేరుకున్నారు. సంప్రదాయ దుస్తుల్లో ఆలయ మాడవీధుల్లో ఏడు ప్రదక్షిణలు పూర్తి చేసి, అనంతరం క్యూలైన్ల ద్వారా చందన స్వరూపుడైన వేంకటేశ్వర స్వామివారిని దర్శించుకున్నారు.

**భక్తులకు అన్నప్రసాదం**

స్వామివారి దర్శనం అనంతరం ఆలయ సన్నిధిలో ఏర్పాటు చేసిన అన్నప్రసాదాన్ని భక్తులు స్వీకరించారు. శ్రీ వకుళ మాత అన్నదాన భవనంలో భక్తులకు నిర్వహిస్తున్న భోజన ఏర్పాట్లు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. భక్తులకు అరటి ఆకు వేసి సంప్రదాయ పద్ధతిలో వడ్డించడంతో పలువురు భక్తులు ఆనందం వ్యక్తం చేశారు. తిరుమల తిరుపతి దేవస్థానంలో భక్తులకు నిర్వహించే అన్నదాన తరహాలో వాడపల్లి క్షేత్రంలోనూ ఆతిథ్యం అందించడం సంతోషదాయకంగా ఉందని భక్తులు పేర్కొన్నారు.

**భక్తులకు ఇబ్బందులు లేకుండా ఏర్పాట్లు**

ఆలయానికి వచ్చే భక్తులకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా అవసరమైన ఏర్పాట్లు చేసినట్లు ఆలయ ఉపకమిషనర్ నల్ల సూర్యచక్రధర్‌రావు తెలిపారు. భక్తుల రద్దీకి అనుగుణంగా క్యూలైన్లు, దర్శన ఏర్పాట్లను పర్యవేక్షించినట్లు పేర్కొన్నారు. ఆలయ పరిసరాల్లో భక్తులకు అవసరమైన సౌకర్యాలపై అధికారులు ఎప్పటికప్పుడు దృష్టి సారించారు.



**వెంకన్న సన్నిధిలో సినీ సందడి**

శనివారం సాయంత్రం వాడపల్లి ఆలయంలో సినీ సందడి నెలకొంది. సినీనటుడు జీవన్‌కుమార్ చందన స్వరూపుడైన వేంకటేశ్వర స్వామివారిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించి జీవన్‌కుమార్‌కు తీర్థప్రసాదాలు అందజేశారు. ఆలయ విశిష్టత, భక్తుల సందడి తనను ఆకట్టుకున్నాయని, వాడపల్లి క్షేత్రానికి రావడం, స్వామివారి దర్శనం చేసుకోవడం ఎంతో ఆనందంగా ఉందని ఆయన పేర్కొన్నారు. స్వామివారి కటాక్షం అందరిపై ఉండాలని ఆకాంక్షించారు.

**ఆకట్టుకున్న సాంస్కృతిక ప్రదర్శన**

సాయంత్రం ఆలయ సన్నిధిలో నిర్వహించిన సాంస్కృతిక ప్రదర్శన భక్తులను విశేషంగా ఆకట్టుకుంది. భక్తులు కుటుంబ సమేతంగా కార్యక్రమాన్ని తిలకిస్తూ ఆధ్యాత్మిక వాతావరణాన్ని ఆస్వాదించారు. ఆలయ పరిసరాల్లో భక్తి, ఆధ్యాత్మికతతో పాటు సాంస్కృతిక సందడి నెలకొంది.

**పోలీసుల భద్రతా చర్యలు**

భక్తుల రద్దీ దృష్ట్యా ఎటువంటి అవాంఛనీయ ఘటనలకు తావులేకుండా ఆత్రేయపురం ఎస్సై తన సిబ్బందితో ఆలయ పరిసరాల్లో భద్రతా ఏర్పాట్లు చేపట్టారు. క్యూలైన్లు, ఆలయ మాడవీధులు, రద్దీ ప్రాంతాల్లో సిబ్బందిని ఏర్పాటు చేసి భక్తుల రాకపోకలను పర్యవేక్షించారు. భక్తులు ప్రశాంత వాతావరణంలో స్వామివారిని దర్శించుకునేలా పోలీసు సిబ్బంది విధులు నిర్వహించారు.



# బీసీ రిజర్వేషన్లపై వైఎస్సార్సీపీ కుట్ర: పెంకే శ్రీనివాస్ బాబా




**కాకినాడ, పెన్ పవర్,అక్టోబర్ 3 :** స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీ రిజర్వేషన్లను 34 శాతం నుంచి 24 శాతానికి కుదిస్తూ హైకోర్టు ఇచ్చిన స్టే ఆర్డర్ వెనుక వైఎస్సార్సీపీ కుట్ర ఉందని టీడీపీ కాకినాడ పార్లమెంట్ ప్రధాన కార్యదర్శి పెంకే శ్రీనివాస్ బాబా ఆరోపించారు. కాకినాడ జిల్లా తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ బీసీలకు జరుగుతున్న అన్యాయంపై ఆవేదన వ్యక్తం చేశారు.రాజకీయంగా గుర్తింపు లేని బీసీలకు తెలుగుదేశం పార్టీ ఆవిర్భావం నుంచే ఎన్టీఆర్ పెద్దపీట వేశారని శ్రీనివాస్ బాబా తెలిపారు.1987లో స్థానిక సంస్థల్లో బీసీలకు తొలిసారిగా 20 శాతం రిజర్వేషన్లు కల్పించారని, అనంతరం 1995లో ఎన్టీఆర్, చంద్రబాబు నాయుడు ఆ రిజర్వేషన్లను 34 శాతానికి పెంచి అమలు చేశారని పేర్కొన్నారు.1992లో సుప్రీంకోర్టు మొత్తం రిజర్వేషన్లు 50 శాతానికి మించకూడదని తీర్పు ఇచ్చినప్పటికీ అప్పటి ప్రభుత్వం బీసీ రిజర్వేషన్లను అడ్డుకోలేదన్నారు. 2019లో వైఎస్సార్సీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత కోర్టు కేసుల ద్వారా బీసీ రిజర్వేషన్లను 24 శాతానికి తగ్గించే పరిస్థితి ఏర్పడిందని ఆరోపించారు. గత ప్రభుత్వం నిర్వహించిన కులాల సర్వే వివరాలను బీసీల హక్కుల పరిరక్షణకు వినియోగించలేదని విమర్శించారు. 'ఆదరణ-2' పథకం కింద బీసీలకు పనిముట్లు అందించకుండా వందల కోట్ల రూపాయలు వృథా చేశారని ఆరోపించారు.ప్రస్తుత కూటమి ప్రభుత్వం బీసీల హక్కుల సాధన కోసం రాజీవ్ మిశ్రా నేతృత్వంలో కమిటీని ఏర్పాటు చేసిందని శ్రీనివాస్ బాబా తెలిపారు. ఫ్యామిలీ సర్వేలో రాష్ట్రంలో బీసీల జనాభా 50.42 శాతంగా తేలిందని, ఆ వివరాలను కోర్టులకు సమర్పించినట్లు వెల్లడించారు. రాబోయే రెండు మూడు నెలల్లో 90 శాతం సబ్సిడీతో 'ఆదరణ-3' పథకాన్ని భారీ బడ్జెట్‌తో అమలు చేయనున్నట్లు తెలిపారు.బీసీల సంక్షేమానికి టీడీపీ ఎల్లప్పుడూ కట్టుబడి ఉంటుందని రాష్ట్ర పెరిక కార్పొరేషన్ అధ్యక్షుడు వనపర్తి బద్రి అన్నారు. గత వైఎస్సార్సీపీ ప్రభుత్వం బీసీలను ఓటు బ్యాంకుగా మాత్రమే ఉపయోగించుకుందని ఆయన విమర్శించారు.సమావేశంలో మాజీ జెడ్పీ చైర్మన్ గుత్తుల బుల్లిరాజు, కరప మండలం టీడీపీ మాజీ ప్రధాన కార్యదర్శి సంఘాని బాల మహేశ్వరరావు, మాజీ సర్పంచ్ గెదెల సత్తిబాబు, కాకినాడ రూరల్ మండల ట్రేడ్ యూనిట్ అధ్యక్షుడు కొప్పిశెట్టి నాగబాబు, కాకినాడ రూరల్ బీసీ సెల్ అధికార ప్రతినిధి చెల్లుబోయిన ప్రకాష్, టీడీపీ సీనియర్ నాయకులు గొమ్మిడి తాతారావు,గొంతు గోవిందరాజు తదితరులు పాల్గొన్నారు.

# గండేపల్లిలో అర్హులకు పింఛన్ల పంపిణీ

**మరణించిన వారి భార్యలకు స్పౌస్ పింఛన్లు.. డయాలసిస్ బాధితుడికి ఆర్థిక చేయూత**





**గండేపల్లి, పెన్ పవర్,అక్టోబర్ 3,** కాకినాడ జిల్లా గండేపల్లి మండలంలోని గండేపల్లి గ్రామంలో అర్హులైన లబ్ధిదారులకు సామాజిక పింఛన్లను గ్రామ తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు బొల్లంరెడ్డి రామకృష్ణ పంపిణీ చేశారు. ఇటీవల మరణించిన అక్కిరెడ్డి నరసింహామూర్తి భార్య సత్యవతికి, ఒగ్గు వెంకట్రావు భార్య లక్ష్మికి స్పౌస్ పింఛన్లను అందజేశారు. అలాగే డయాలసిస్ బాధితుడు రెడ్డి సత్యనారాయణకు డయాలసిస్ పింఛన్‌ను పంపిణీ చేశారు. స్థానిక బ్రహ్మంగారి గుడిలో పనిచేస్తుండగా కాళ్లపై టైల్స్ పడి రెండు కాళ్లు విరిగిన పిల్లి అప్పయ్యమ్మను రామకృష్ణ పరామర్శించారు. ఆమెకు పింఛన్ నగదును అందజేసి ధైర్యం చెప్పారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు పైల వెంకన్న, ఇప్పర్ల సురేష్, చిటికెల కన్నబాబు, ఒగ్గు గణపతి, సచివాలయ సిబ్బంది వెస్లీ, గంగాభవాని, కావ్య తదితరులు పాల్గొన్నారు.

# దుర్గాదేవి ఆశీస్సులు నియోజకవర్గ ప్రజలందరిపైనా ఉండాలి.

**-ప్రత్తిపాడు నియోజకవర్గం వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ ఇన్ఛార్జ్ ముద్రగడ గిరిబాబు.**



**కిర్లంపూడి/ప్రత్తిపాడు, పెన్ పవర్, 03:** ఆ దుర్గాదేవి ఆశీస్సులు నియోజకవర్గ ప్రజలందరిపైనా ఉండాలని ప్రత్తిపాడు నియోజకవర్గం వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ ముద్రగడ గిరిబాబు అన్నారు. రౌతులపూడి శ్రీ శ్రీనివాస వర్తక సంఘం ఆధ్వర్యంలో నిర్వహించే దేవీ నవరాత్రుల మహోత్సవ పోస్టర్ ఆవిష్కరణ కార్యక్రమాన్ని మండల కేంద్రమైన కిర్లంపూడి ముద్రగడ గిరిబాబు నివాసంలో శనివారం ఘనంగా నిర్వహించారు. రౌతులపూడి వాసిరెడ్డి భాస్కర్ బాబు ఆధ్వర్యంలో శ్రీ శ్రీనివాస వర్తక సంఘం ప్రతినిధులు, ముద్రగడ గిరిబాబును కిర్లంపూడి వారి నివాసంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా రాబోయే దేవీ నవరాత్రుల మహోత్సవాలను పురస్కరించుకుని ఉత్సవ పోస్టర్‌ను ముద్రగడ గిరిబాబు చేతుల మీదుగా ఘనంగా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా గిరిబాబు మాట్లాడుతూ ఆ దుర్గాదేవి ఆశీస్సులతో నియోజకవర్గ ప్రజలందరూ ఆయురారోగ్యాలతో, సుఖ సంతోషాలతో వర్ధిల్లాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ, వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి అంగూరి లక్ష్మీ శివకుమారి, రాపర్తి రామకృష్ణ, కేదారిశెట్టి నాగేశ్వరరావు, సురెడ్డి తిరుమలరాయలు, సుర్ల సత్తిబాబు,ఎడ్ల బుజ్జి, గాడి రామనాథం, శ్రీ శ్రీనివాస వర్తక సంఘం సభ్యులు, పలువురు వైసీపీ ముఖ్య నాయకులు పాల్గొన్నారు.

## స్వచ్ఛ గ్రామ పంచాయతీ అవార్డు గ్రహీత ఫణీంద్ర కుమార్‌కు సన్మానం

**గండేపల్లి పారిశుద్ధ్య నిర్వహణకు స్వచ్ఛ ఆంధ్ర--స్వర్ణ ఆంధ్ర పురస్కారం**





**గండేపల్లి, పెన్ పవర్, అక్టోబర్ 3:** గండేపల్లి గ్రామ పంచాయతీ అభివృద్ధి అధికారి కె. ఫణీంద్ర కుమార్‌కు స్వచ్ఛ ఆంధ్ర కార్పొరేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన జిల్లా స్థాయి స్వచ్ఛ ఆంధ్ర--స్వర్ణ ఆంధ్ర పురస్కారాల ప్రదానోత్సవంలో అవార్డు లభించింది. గండేపల్లి గ్రామ పంచాయతీలో పారిశుద్ధ్య నిర్వహణలో చూపిన కృషికి గుర్తింపుగా అక్టోబర్ 2న నిర్వహించిన కార్యక్రమంలో ఈ పురస్కారాన్ని అందజేశారు. ఈ సందర్భంగా శనివారం (అక్టోబర్ 3) గండేపల్లి మండల పరిషత్ కార్యాలయంలో మండల పరిషత్ అభివృద్ధి అధికారి కె. హరికృష్ణ సత్యారెడ్డి ఆధ్వర్యంలో ఫణీంద్ర కుమార్‌ను అధికారులు, సిబ్బంది ఘనంగా సత్కరించారు. గ్రామ పంచాయతీకి జిల్లా స్థాయిలో గుర్తింపు తీసుకురావడం పట్ల వారు అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో పరిపాలనాధికారి కె. చంద్రరావు, ఉప మండల పరిషత్ అభివృద్ధి అధికారి బి. శిరీష, మండలంలోని వివిధ గ్రామాల పంచాయతీ అభివృద్ధి అధికారులు, మండల పరిషత్ కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

## అంతర్జాతీయ అహింసా దినోత్సవం సందర్భంగా ఆదిత్య విశ్వవిద్యాలయం లో వక్తృత్వ పోటీలు






**గండేపల్లి పెన్ పవర్ (సూరంపాలెం), అక్టోబర్ 03,** విద్యార్థులలో శాంతి, అహింస, సత్యం, సామాజిక బాధ్యత వంటి విలువలు పెంపొందించే లక్ష్యంతో, ఆదిత్య విశ్వవిద్యాలయం నాలెడ్జ్ రిసోర్స్ సెంటర్ (ఖ=జ) అంతర్జాతీయ అహింసా దినోత్సవం మరియు గాంధీ జయంతి సందర్భంగా వక్తృత్వ పోటీ నిర్వహించింది. జాతిపిత మహాత్మా గాంధీ అహింసా సూత్రాల ప్రాముఖ్యత, నేటి ప్రపంచంలో వాటి ఆవశ్యకత పై తమ అభిప్రాయాలు, ఆలోచనలు వ్యక్తపరచడానికి ఈ పోటీ విద్యార్థులకు ఒక అవకాశాన్ని కల్పించింది. విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొని, తమ భావవ్యక్తీకరణ నైపుణ్యాలు, ఆత్మవిశ్వాసాన్ని, గాంధీ విలువలపై అవగాహనను ప్రదర్శించారు. ఈ పోటీకి వై. శశికళ న్యాయనిర్ణేతగా వ్యవహరించారు. ఆమె పోటీలో పాల్గొన్నవారిలో ప్రసంగంలోని విషయం, ప్రసంగ శైలి, స్పష్టత, ఆత్మవిశ్వాసం, మొత్తం ప్రదర్శన ఆధారంగా మూల్యాంకనం చేశారు. పోటీ విజేతలు: మొదటి బహుమతి: పి. నిహాల్, రెండవ బహుమతి: క్లైవ్ న్యాషా మన్యాని మరియు మూడవ బహుమతి: వి. అలేఖ్య. పోటీలో పాల్గొన్న విద్యార్థులందరినీ విశ్వవిద్యాలయం అధికారులు అభినందించారు మరియు అద్భుతమైన ప్రదర్శన కనబరిచిన విజేతలకు బహుమతులు మరియు ప్రశంసా పత్రాలు అందజేశారు. ఈ కార్యక్రమం యువతరంలో శాంతి, సహనం, పరస్పర గౌరవం మరియు అహింసను ప్రోత్సహించాల్సిన ప్రాముఖ్యతను నొక్కి చెప్పింది. ఈ కార్యక్రమంలో ప్రధాన గ్రంథాలయ అధికారి కె. అశోక్ కుమార్ మరియు గ్రంథాలయం సిబ్బంది వెంకట్, సుజాత, రవిబాబు, లక్ష్మణ్, సాయిరాం తదితరులు పాల్గొన్నారు .

## ఆంధ్ర విజ్ఞాన సమ్మేళనంలో ఆదిత్య విద్యార్థుల ప్రతిభ




**కాకినాడ, పెన్ పవర్,అక్టోబర్ 3:**భారతీయ భాషా సమితి, ఆంధ్రప్రదేశ్ విద్యా మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో విజయవాడలోని స్కూల్ ఆఫ్ ప్లానింగ్ అండ్ ఆర్కిటెక్చర్‌లో సెప్టెంబర్ 28, 29 తేదీల్లో రెండు రోజులపాటు ఆంధ్ర విజ్ఞాన సమ్మేళనం నిర్వహించారు. తెలుగులో తొలిసారిగా నిర్వహించిన ఈ సమ్మేళనంలో వివిధ విశ్వవిద్యాలయాలు,కళాశాలలకు చెందిన ప్రొఫెసర్లు,అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు. ఈ సమ్మేళనంలో ఆదిత్య డిగ్రీ అండ్ పీజీ అటానమస్ కళాశాల డేటా సైన్స్ విభాగానికి చెందిన విద్యార్థులు ఎనిమిది బృందాలుగా పాల్గొన్నారు. 'సమాజ శ్రేయస్సు కోసం కృత్రిమ మేధస్సు వినియోగం' అనే అంశంపై తమ ప్రాజెక్టు అబ్స్ట్రాక్టులు, మెథడాలజీలను ప్రదర్శించారు. విద్యార్థులు న్యూట్రి స్కాన్ ఏఐ, మండి ప్రిడిక్ట్, గ్రీన్ ఎనర్జీ, రెస్క్యూ స్వార్మ్ ఏఐ, అకాడమిక్ క్యూ, హిస్టారికల్ ఇన్‌స్క్రిప్షన్స్, ఓమ్ని ఎక్స్చేంజ్ ఏఐ, అడాప్టివ్ ఏఐ ట్యూటర్ వంటి వినూత్న కృత్రిమ మేధస్సు ప్రాజెక్టులను ప్రదర్శించారు. సమాజంలోని వివిధ సమస్యలకు కృత్రిమ మేధస్సు ఆధారంగా పరిష్కారాలు చూపించేలా ప్రాజెక్టులను రూపొందించినందుకు నిర్వాహకులు విద్యార్థులను అభినందించారు. విద్యార్థులు ప్రదర్శించిన ప్రాజెక్టులను ఆంధ్ర విజ్ఞాన సమ్మేళనం పుస్తకంలో ప్రచురించడం విశేషమని కళాశాల ప్రతినిధులు తెలిపారు. విద్యార్థులను ఆదిత్య విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ నల్లమిల్లి శేషారెడ్డి, డిగ్రీ కళాశాలల సెక్రటరీ డాక్టర్ నల్లమిల్లి సుగుణా రెడ్డి, అకడమిక్ డైరెక్టర్ డాక్టర్ బి.ఈ.వి.ఎల్. నాయుడు, విభాగాధిపతి జి. విజయలక్ష్మి, అధ్యాపకులు జయవర్ధన్ అభినందించి శుభాకాంక్షలు తెలిపారు.

## కొంతంగి పంచాయతీ నిధులు ఏమయ్యాయో తెలియదు.

- కొంతంగి గ్రామసభలో కార్యదర్శి వింత సమాధానం...






**శంఖవరం పెన్ పవర్ అక్టోబర్ 03:-** కొంతంగి పంచాయతీ సాధారణ నిధులు ఎంత. వాటితో గడచిన కాలంలో ఏయే అభివృద్ధి పనులు చేసారని విజయవాడ రైల్వే డివిజన్ సంప్రదింపుల కమిటీ సభ్యులు, కొంతంగి కొత్తూరు జనసేన పార్టీ అధ్యక్షుడు గొర్లి నాగేశ్వరరావు అడిగిన ప్రశ్నకు వింత సమాధానం ఎదురైంది. ఇప్పటి వరకు పంచాయతీ జనరల్ ఫండ్ ఎంతో, ఏమైందో నాకు తెలియదని ఇంచార్జ్ కార్యదర్శి వీరబాబు బదులిచ్చారు. కాకినాడ జిల్లా ప్రత్తిపాడు నియోజకవర్గం శంఖవరం మండలం కొంతంగి కొత్తూరు గ్రామ పంచాయతీ కార్యాలయంలో ప్రతీ మూడు నెలలకో మారు విధిగా చేపట్టే ఈ గ్రామ సభను శుక్రవారం నిర్వహించారు. మహాత్మా గాంధీ 167 జయంతిని పురస్కరించుకుని మహాత్మా చిత్ర పటానికి పూల మాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. అనంతరం గ్రామ ప్రత్యేక అధికారి అధ్యక్షతన గ్రామ సభను నిర్వహించారు. ఈ సందర్భంగా పలు గ్రామ సమస్యలను పరిష్కరించాలని గొర్లి నాగేశ్వరరావు సభలో కోరారు. పంచాయతీ కుళాయిల నీరు ప్రతీ ఇంటికీ సక్రమంగా సరఫరా కావడం లేదు. అసలు రక్షిత తాగునీటి సరఫరా పథకం బోరు బావి మోటారు మరమ్మతులకు ఎంత ఖర్చు చేశారని నాగేశ్వరరావు ప్రశ్నించారు. ప్రతీ 15 రోజులకు ఒక సారి కాల్వల్లో మురుగును తీయాల్సి ఉండగా ఆరు నెలలకోసారి తీస్తున్నారు. 15 రోజులకు ఒక సారి కాల్వల్లో మురుగును తీయండి. గ్రామం అంతటానూ, అలాగే గ్రామానికి దూరంగా ఉన్న జగనన్న కాలనీలో కూడా పూర్తిగా వీధి దీపాలు లేవు. వెంటనే వీధి దీపాలు వేసి గ్రామంలో వెలుగు నింపండి. 80-1 సర్వే నెంబర్లోని స్మశాన వాటిక సర్వే చేసి సరిహద్దులను స్థిరీకరించండి. అప్పుడు దాని అభివృద్ధికి ప్రత్తిపాడు ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ, కాకినాడ ఎంపీ తంగెళ్ళ ఉదయ్ శ్రీనివాస్ నుంచి నిధులను మంజూరు చేయించు కుంటాం. గ్రామ పంచాయతీ చెత్త రవాణా ట్రాక్టర్ చాలా కాలంగా మూలన పడి ఉంది. త్వరగా మరమ్మతులు చేయించండి. గ్రామంలోని చెత్త రవాణాకు వినియోగం లోనికి తీసుకురండని నాగేశ్వరరావు కోరారు. పంచాయతీలోని 14, 15 ఆర్థిక సంఘం నిధుల వినియోగంపై గతంలో నేను పౌర సమాచార చట్టం హక్కు 2025 ప్రకారం దరఖాస్తు చేసి చేసాను. ఇప్పటికింకా సమాచారం ఎందుకు ఇవ్వలేదు. అడుగుతూంటే నేను ఇంఛార్జి కార్యదర్శిని, ఇంకా పూర్తిగా ఛార్జ్ తీసుకోలేదని ప్రస్తుత కార్యదర్శిగా మీరు ఎందుకు తప్పించు కుంటున్నారని గొర్లి నాగేశ్వరరావు నిలదీశారు. అన్నింటికీ కార్యదర్శి మౌనమే సమాధానం అయ్యింది. ఈ కార్యక్రమంలో సర్నం గోవిందు, బద్ది లోవరాజు, నడిగట్ల ఏడుకొండలు, సర్నం పూర్ణయ్య , ఆకేటి సత్యనారాయణ,ముప్పన బుజ్జి, ముప్పన వెంకటరమణ, బర్ల దొంగబాబు , రాయి రామకృష, పర్సిన శివ, సింహాద్రి కుమార్ తదితరులు పాల్గొన్నారు.

### కిర్లంపూడి ప్రభుత్వ పాఠశాల ఎస్ ఎం సి చైర్మన్‌గా ఆళ్ళ బాబులు



**కిర్లంపూడి,పెన్ పవర్,అక్టోబర్, 03:కాకినాడ జిల్లా :**కిర్లంపూడి శ్రీ కొక్కొండ రామశేషగిరిరావు పంతులు ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో స్కూల్ మేనేజ్‌మెంట్ కమిటీ (ఎస్ఎంసీ) ఎన్నికలు శనివారం ప్రశాంత వాతావరణంలో జరిగాయి. గత నెల 29న కోరం లేక వాయిదా పడిన ఎన్నికలను అధికారులు శనివారం నిర్వహించారు. రెండు వర్గాలు పోటీపడటంతో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా కిర్లంపూడి ఎస్సై సతీష్‌కుమార్ ఆధ్వర్యంలో పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు. ఎన్నికల పరిశీలకులు నాయక్ తదితరులు ప్రక్రియను పర్యవేక్షిస్తూ ఎన్నికలు సజావుగా జరిగేలా చర్యలు చేపట్టారు.ఈ ఎన్నికల్లో ఆళ్ళ బాబులు వర్గానికి చెందిన 19 మంది సభ్యులు విజయం సాధించగా, ఎస్ఎంసీ చైర్మన్‌గా ఆళ్ళ బాబులను సభ్యులు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. వైస్‌చైర్మన్‌గా మాదిబోయిన వరలక్ష్మిని ఏకగ్రీవంగా సభ్యులు ఎన్నుకున్నారు. అనంతరం అధికారులు నూతన చైర్మన్, వైస్‌చైర్మన్‌తో పాటు కమిటీ సభ్యులతో ప్రమాణ స్వీకారం చేయించారు. ఎన్నికల ప్రక్రియ ప్రశాంతంగా, పారదర్శకంగా జరిగేలా సహకరించిన పోలీసు అధికారులు, పరిశీలకులు, సిబ్బంది, సభ్యులు, తల్లిదండ్రులకు పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు రమణకుమారి ధన్యవాదాలు తెలిపారు.నూతన కమిటీ చైర్మన్ తోపాటు సభ్యులను టిడిపి నాయకులు అభినందించారు.

## పాఠశాలకు సీలింగ్ ఫ్యాన్లు మరియు యల్.ఇ.డి ట్యూబ్ లైట్లు బహూకరణ



**అల్లవరం,పెన్ పవర్, అక్టోబర్ 03:** కొమరగిరిపట్నం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు మోసుగంటి గంగయ్య మెమోరియల్ ఎడ్యుకేషనల్ అండ్ ఛార్టిబుల్ ట్రస్ట్ కొమరగిరిపట్నం వారిచే మూడు సీలింగ్ ఫ్యాన్లు మరియు 6 యల్.ఇ.డి.ట్యూబ్ లైట్లను పాఠశాల ప్రధానోపాధ్యాయులు సాల సత్యనారాయణ సమక్షంలో బహూకరించారు.ఇటీవల ప్రధానోపాధ్యాయులు కాకినాడ చేయూత స్వచ్ఛంద సంస్థ చే అవార్డును మరియు అక్టోబర్ 2 న కలెక్టరేట్ లో కలెక్టర్ ద్వారా సాస్ అవార్డును పొందిన సందర్భంగా సత్యనారాయణ ని రుద్రరాజు సీతాపతిరాజు మెమోరియల్ చారిటబుల్ ట్రస్ట్ మరియు మోసుగంటి గంగయ్య మెమోరియల్ చారిటబుల్ ట్రస్ట్ వారిచే సన్మానించారు ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు శ్రీ సాల సత్యనారాయణ, ఇన్ ఛార్జ్ ప్రధానోపాధ్యాయులు చిట్టుమేను వేంకటేశ్వరరావు, మోసుగంటి వెంకటేశ్వరరావు, రుద్రరాజు రమేష్ రాజు, పాఠశాల ఉపాధ్యాయులు పద్మావతి,శివజ్యోతి, అడబాలశ్రీనివాస్,ఎ.సుబ్రహ్మణ్యం,వై.ప్రభాకర్, సతీష్, విజయకుమార్,మణి మరియు విద్యార్థులు పాల్గొన్నారు.

### మందేశ్వరస్వామి ఆలయంలో రూ.3.21 లక్షల ఆదాయం



**కొత్తపేట,పెన్ పవర్,అక్టోబర్ 3:** డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ కోనసీమ జిల్లా కొత్తపేట మండలం మందపల్లిలో వేంచేసి ఉన్న శ్రీ మందేశ్వర (శనేశ్వర) స్వామివారి దేవస్థానంలో శనివారం భక్తులు నిర్వహించిన వివిధ పూజలు, సేవలు, ఆన్‌లైన్ పూజలు, అన్నప్రసాద విరాళాల ద్వారా మొత్తం రూ.3,21,064 ఆదాయం సమకూరినట్లు దేవస్థానం సహాయ కమిషనర్, కార్యనిర్వహణాధికారి దారపురెడ్డి సురేష్‌బాబు తెలిపారు.శ్రీ స్వామివారికి నిర్వహించిన ప్రత్యక్ష పూజల్లో భాగంగా ముఖమండపం తైలాభిషేకం 35 సేవల ద్వారా రూ.24,500, ఏకాదశ రుద్ర తైలాభిషేకం 278 సేవల ద్వారా రూ.69,500, మహన్యాస పూర్వక తైలాభిషేకం 283 సేవల ద్వారా రూ.49,525 ఆదాయం లభించింది. తైలం సమర్పించి దర్శనం ద్వారా 209 సేవలకు రూ.16,720, తిలదానం ద్వారా రూ.1,100, స్వయం హోమం ద్వారా రూ.2,400, స్వయం జపం ద్వారా రూ.8,000, కేశఖండన ద్వారా రూ.40 ఆదాయం వచ్చింది.ఈ విధంగా ప్రత్యక్ష పూజలు, సేవల ద్వారా మొత్తం రూ.1,71,785 ఆదాయం సమకూరింది. అదేవిధంగా పరోక్షంగా నిర్వహించిన ఆన్‌లైన్ పూజల ద్వారా రూ.1,18,000, అన్నప్రసాదం విరాళాల ద్వారా రూ.31,279 ఆదాయం లభించింది.ప్రత్యక్ష పూజలు, ఆన్‌లైన్ పూజలు, అన్నప్రసాద విరాళాలు కలిపి శనివారం ఒక్కరోజే దేవస్థానానికి రూ.3,21,064 ఆదాయం వచ్చినట్లు ఈఓ దారపురెడ్డి సురేష్‌బాబు వెల్లడించారు. భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా దేవస్థానంలో పూజా కార్యక్రమాలు, సేవలు సక్రమంగా నిర్వహించినట్లు తెలిపారు.

# వాడపల్లి వెంకన్నకు భక్తజన ప్రవాహం





**ఒక్కరోజే 98 వేల మంది దర్శనం.. రూ.65 లక్షల ఆదాయం**

**ఆత్రేయపురం పెన్ పవర్ అక్టోబర్ 3:** కోనసీమ తిరుమల వాడపల్లి శ్రీ వేంకటేశ్వరస్వామి వారి క్షేత్రం శనివారం భక్తజన సందోహంతో కిక్కిరిసింది. వేకువజాము నుంచే వివిధ ప్రాంతాల నుంచి పెద్దసంఖ్యలో భక్తులు తరలిరావడంతో ఆలయ పరిసరాలు కిటకిటలాడాయి. సుమారు 98 వేల మంది భక్తులు స్వామివారిని దర్శించుకున్నట్లు ఆలయ డీసీ నల్లం సూర్యచక్రధరరావు తెలిపారు.భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకుని చిన్నారులు, దివ్యాంగులకు ప్రత్యేక స్లాట్లను ఏర్పాటు చేసి దర్శనానికి అవకాశం కల్పించినట్లు ఆయన పేర్కొన్నారు. రద్దీ నియంత్రణతో పాటు భక్తులకు అవసరమైన సౌకర్యాలు కల్పించేందుకు ఆలయ సిబ్బంది చర్యలు చేపట్టినట్లు తెలిపారు. శనివారం ఒక్కరోజే ఆలయానికి సుమారు రూ.65 లక్షల ఆదాయం సమకూరినట్లు డీసీ వెల్లడించారు.

## 50 మంది వృద్ధులకు దుప్పట్ల పంపిణీ



**మాజీ సర్పంచ్ గుణ్ణం రాంబాబు ఆధ్వర్యంలో**

**ఆలమూరు, పెన్ పవర్,అక్టోబర్ 03:**మండలంలో శీతాకాలం ప్రారంభమవుతున్న నేపథ్యంలో వృద్ధులకు, నిరుపేదలకు అండగా నిలవడమే ధ్యేయంగా మాజీ సర్పంచ్ గుణ్ణం రాంబాబు శనివారం 50 మంది వృద్ధులకు ఉచితంగా దుప్పట్లను పంపిణీ చేశారు.ఈ సందర్భంగా గుణ్ణం రాంబాబు మాట్లాడుతూ... రానున్న చలికాలాన్ని దృష్టిలో ఉంచుకుని వృద్ధులు, వయోవృద్ధులు చలి తీవ్రతకు గురికాకుండా ఉండాలనే ఉద్దేశంతోనే ఈ కార్యక్రమాన్ని చేపట్టినట్లు తెలిపారు. సమాజంలో ఇబ్బందులు పడుతున్న పేదలకు తమవంతు సాయం అందించడం ఎంతో సంతృప్తిని ఇస్తుందన్నారు. భవిష్యత్తులో కూడా ఇలాంటి సామాజిక, సేవా కార్యక్రమాలను మరిన్ని నిర్వహిస్తామని ఆయన పేర్కొన్నారు.దుప్పట్లు అందుకున్న వృద్ధులు తమకు ఈ కష్టసమయంలో తోడ్పాటు అందించిన మాజీ సర్పంచ్ గుణ్ణం రాంబాబుకు ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేసి, అభినందించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపిటిసి యార్లగడ్డ రమేష్ చౌదరి, బీర అబ్బు, గంటా అర్జున్ రావు, నెల్లి సత్యనారాయణ, పలువురు గ్రామస్థులు పాల్గొన్నారు.

## వేలంకలో ఎరికిరెడ్డి నాగమణి కుటుంబానికి పలువురి పరామర్శ



**కిర్లంపూడి, పెన్ పవర్, అక్టోబర్, 03:**కిర్లంపూడి మండలం వేలంక గ్రామంలో ఇటీవల గుండెపోటుతో మృతి చెందిన జర్నలిస్ట్ సుబ్బు తుమ్మల అత్త స్వర్గీయ ఎరికిరెడ్డి నాగమణి చిత్రపటానికి పలువురు ప్రముఖులు నివాళులు అర్పించారు. నాగమణి కుటుంబ సభ్యులను, ఆమె అల్లుడు జర్నలిస్ట్ సుబ్బు తుమ్మలను పరామర్శించి తమ ప్రగాఢ సానుభూతిని తెలిపారు. ఈ సందర్భంగా రాష్ట్ర రోడ్డు డెవలప్‌మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్ వెన్నా శివ, ప్రత్తిపాడు నియోజకవర్గ తెలుగు యువత అధ్యక్షులు కీర్తి వెంకట సుభాష్, రాష్ట్ర తెలుగు యువత కార్యదర్శి అడబాల వెంకటేశ్వరరావు,యర్రవరం మాజీ ఎంపీటీసీ మైరాల కనకరావు, ప్రైమ్ 9 రిపోర్టర్ ప్రతి శ్రీనివాసరావు, అఖిల్ స్కూల్ అధినేత ఇనకోటి గంగాధర్,కిర్లంపూడి మండల తెలుగు యువత అధ్యక్షులు గండే కాశీ విశ్వనాథ్, ఉమర్ ఆలీషా స్కూల్ కరెస్పాండంట్ ఆకుల నవీన్, కోలా వెంకట్, రామవరం టీడీపీ నాయకులు తదితరులు నాగమణి చిత్రపటానికి నివాళులు అర్పించారు. అలాగే రాష్ట్ర బీజేపీ ఓబీసీ మోర్చా ఉపాధ్యక్షులు పైలా బోస్ కుటుంబ సభ్యులను పరామర్శించారు. ప్రత్తిపాడు మాజీ ఎమ్మెల్యే వరుపుల సుబ్బారావు తనయుడు, జనసేన నాయకులు వరుపుల రాజబాబు, లింగంపర్తి జనసేన నాయకులు అల్లు తాతాజీ కూడా నాగమణి చిత్రపటానికి నివాళులు అర్పించి కుటుంబ సభ్యులను పరామర్శించారు. కిర్లంపూడి మాజీ సర్పంచ్ పెంటకోట నాగబాబు, ఉత్తరకంచి తాజా మాజీ సర్పంచ్ మంతెన వెంకటరమణ, నాయకులు పసుపులేటి సత్యనారాయణ, మళ్ల నాగబాబు, యల్లపు నానాజీ, వెలుగు రిపోర్టర్ పెనగంటి గోవింద్ తదితరులు నాగమణి కుటుంబ సభ్యులను పరామర్శించారు. మాజీ అన్నవరం ట్రస్ట్ బోర్డు సభ్యులు దలే చిట్టిబాబు, పోతులూరు మాజీ సర్పంచ్ పంచాది వీరబాబు, కాకినాడ జిల్లా వైసీపీ లీగల్ సెల్ ప్రధాన కార్యదర్శి కూసుమంచి సూర్యప్రకాష్, రాష్ట్ర వైసీపీ విద్యార్థి విభాగం ప్రధాన కార్యదర్శి పెయ్యల రాజా, 6 టీవీ రిపోర్టర్ దాకారపు కృష్ణ, హరిదాసుల శివ, దలే నాని, శ్రీ సూర్య విద్యాసంస్థల అధినేత కొల్లుమళ్ల వీరబాబు, సూర్నీడి వీర గంగాధర్ తదితరులు కూడా కుటుంబాన్ని పరామర్శించి సానుభూతి తెలిపారు. జర్నలిస్ట్ మిత్రులు ఉడతా అప్పారావు, పెంటకోట సాయి తదితరులు నాగమణి చిత్రపటానికి నివాళులు అర్పించి జర్నలిస్ట్ సుబ్బు తుమ్మలతో పాటు కుటుంబ సభ్యులను పరామర్శించారు. నాగమణి మృతితో కుటుంబ సభ్యులు, బంధువులు, సన్నిహితులు తీవ్ర విషాదంలో ఉన్నారు. ఈ సందర్భంగా పలువురు ప్రముఖులు, నాయకులు, జర్నలిస్టులు వేలంకకు చేరుకుని కుటుంబానికి అండగా నిలిచారు.పలువురు కుటుంబ సభ్యులు పాల్గొని నివాళులు అర్పించారు.

## కాంట్రాక్ట్ వైద్య సిబ్బంది సమస్యలు పరిష్కరించాలి



**రామచంద్రపురం, పెన్ పవర్,అక్టోబర్ 3:**రామచంద్రపురం ఏరియా ఆసుపత్రిలో కాంట్రాక్ట్ విధానంలో పనిచేస్తున్న స్టాఫ్ నర్సులు, ల్యాబ్ అసిస్టెంట్లు, పారామెడికల్ సిబ్బంది తమ న్యాయపరమైన సమస్యలను వెంటనే పరిష్కరించాలని యూనియన్ సభ్యులు ఎం. షకీనా,పి.కనకదుర్గ డిమాండ్ చేశారు. ఉద్యోగుల రెగ్యులరైజేషన్‌తో పాటు 100 శాతం గ్రాస్ శాలరీని అమలు చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. ప్రభుత్వం తమ డిమాండ్లను వెంటనే అమలు చేయని పక్షంలో రాష్ట్ర యూనియన్ పిలుపు మేరకు అక్టోబర్ 4, 5, 6, 7 తేదీల్లో దశలవారీగా నిరసన కార్యక్రమాలు చేపట్టి, అనంతరం పూర్తిగా విధులను బహిష్కరిస్తామని వారు హెచ్చరించారు.ఈ మేరకు తమ డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని ఏపీ ఎన్జీవోస్ కోనసీమ జిల్లా అధ్యక్షులు మాధవరపు వెంకటేశ్వర్లు, రామచంద్రపురం ఏరియా ఆసుపత్రి మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ ప్రవీణ్, జిల్లా జాయింట్ సెక్రటరీ రోజామణికి అందజేశారు.రాష్ట్ర యూనియన్ పిలుపు మేరకు నిర్వహించిన ఈ నిరసన కార్యక్రమంలో కాంట్రాక్ట్ స్టాఫ్ నర్సులు,ల్యాబ్ అసిస్టెంట్లు, పారామెడికల్ స్టాఫ్, ఇతర పారామెడికల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## వాడపల్లి వంతెన వద్ద జారుతున్న కాలువ గట్టు

### వాడపల్లి వెంకన్న క్షేత్రానికి దారిలో పొంచి ఉన్న ప్రమాదం





**ఆత్రేయపురం పెన్ పవర్ అక్టోబర్ 3:**కోనసీమ తిరుమలగా ప్రసిద్ధిగాంచిన వాడపల్లి శ్రీ వేంకటేశ్వర స్వామివారి ఆలయానికి వెళ్లే మార్గంలో వంతెన సమీపాన కాలువ గట్టు క్రమంగా కోతకు గురై జారిపోతుండటం భక్తులు, స్థానికుల్లో ఆందోళన రేకెత్తిస్తోంది. నిత్యం వేలాదిమంది భక్తులు రాకపోకలు సాగించే ఈ మార్గంలో గట్టు బలహీనపడుతున్నప్పటికీ సంబంధిత అధికారులు తక్షణ చర్యలు చేపట్టాల్సిన అవసరం ఉందని వాహనదారులు పేర్కొంటున్నారు.ఇప్పటికే గట్టు కొంత మేర మట్టి జారిపోవడంతో పాటు భారీ వాహనాలు రాకపోకలు సాగించే సమయంలో మరింతగా కోతకు గురయ్యే అవకాశం ఉందని స్థానికులు చెబుతున్నారు. ముఖ్యంగా ఆలయానికి భక్తుల రద్దీ అధికంగా ఉండే రోజుల్లో వాహనాల సంఖ్య పెరగడంతో పరిస్థితి మరింత ప్రమాదకరంగా మారే అవకాశం ఉందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.ప్రమాదం సంభవించిన అనంతరం హడావుడిగా చర్యలు చేపట్టడం కంటే ముందస్తు రక్షణ చర్యలు చేపట్టడం ద్వారా ముప్పును నివారించవచ్చని భక్తులు సూచిస్తున్నారు. ఆర్అండ్‌బీ అధికారులు క్షేత్రస్థాయిలో పరిస్థితిని పరిశీలించి కాలువ గట్టును పటిష్టం చేయడంతో పాటు అవసరమైన రక్షణ చర్యలు చేపట్టాలని వారు కోరుతున్నారు. వాడపల్లి క్షేత్రానికి వచ్చే భక్తుల భద్రతను దృష్టిలో ఉంచుకుని అధికారులు తక్షణమే స్పందించాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

# గెద్దనాపల్లిలో ఘనంగా పోషణ మాసోత్సవాలు, అంగన్వాడీ ఉత్సవం.

## -నూతన అంగన్వాడీ భవనాన్ని ప్రారంభించిన ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ.





**కిర్లంపూడి,పెన్ పవర్,అక్టోబర్, 03:**కిర్లంపూడి మండలం గెద్దనాపల్లి గ్రామంలో శనివారం పోషణ మాసోత్సవం, అంగన్వాడీ ఉత్సవం ఘనంగా నిర్వహించారు. సీడీపీఓ, ఎం పూర్ణిమ పర్యవేక్షణలో, గ్రామ టీడీపీ నాయకులు సూరిశెట్టి వెంకట శివ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా జగ్గంపేట శాసనసభ్యులు, టీటీడీ బోర్డు సభ్యులు, టీడీపీ పొలిట్ బ్యూరో సభ్యులు జ్యోతుల నెహ్రూ హాజరై నూతనంగా నిర్మించిన అంగన్వాడీ భవనాన్ని ప్రారంభించారు. విశిష్ట అతిథులుగా బీజేపీ జిల్లా అధ్యక్షులు బిక్కిన విశ్వేశ్వరరావు, రాష్ట్ర బీజేపీ కార్యవర్గ సభ్యులు కంబాల శ్రీనివాసరావు హాజరయ్యారు. ప్రధాని నరేంద్ర మోదీ ముఖ్యమంత్రిగా, ప్రధానమంత్రిగా 25 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా అంగన్వాడీ టీచర్లకు పట్టుచీర, స్వీట్ బాక్స్, పసుపు కుంకుమలు పంపిణీ చేశారు.ఈ సందర్భంగా జ్యోతుల నెహ్రూ మాట్లాడుతూ "సేవా సంకల్ప్ – సే వికసిత్ భారత్" స్ఫూర్తితో ఈ ఉత్సవం నిర్వహించుకోవడం సంతోషంగా ఉందన్నారు. 2001 అక్టోబర్ 7న గుజరాత్ ముఖ్యమంత్రిగా ప్రారంభమైన నరేంద్ర మోదీ ప్రజా సేవా ప్రయాణం 25 సంవత్సరాలు పూర్తి చేసుకుంటున్న సందర్భంగా దేశవ్యాప్తంగా సేవా కార్యక్రమాలు జరుగుతున్నాయని తెలిపారు.అంగన్వాడీ కేంద్రం కేవలం భవనం కాదని, గ్రామంలోని తల్లి, బిడ్డ, కుటుంబానికి సేవా కేంద్రమని అన్నారు. ప్రభుత్వ పథకం ఇంటికి చేరడమే సేవ, గర్భిణీకి పోషకాహారంపై అవగాహన కల్పించడమే సేవ, చిన్నారికి ఎదుగుదల, ఆరోగ్యం, విద్య అందించడమే సేవ అని పేర్కొన్నారు.ముఖ్యంగా అంగన్వాడీ స్కూళ్లకు వచ్చే పిల్లలను సొంత పిల్లల్లా చూసుకుని వారికి అన్ని సౌకర్యాలు కల్పించాలని అంగన్వాడీ టీచర్లను కోరారు.కేంద్రంలో నరేంద్ర మోదీ ఆధ్వర్యంలో బీజేపీ ప్రభుత్వం, రాష్ట్రంలో చంద్రబాబు, పవన్ కళ్యాణ్ ఆధ్వర్యంలో కూటమి ప్రభుత్వం డబుల్ ఇంజన్ సర్కార్ తో అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలతో ముందుకు సాగుతోందని అన్నారు. రేపు రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో కూటమి అభ్యర్థులను గెలిపించి మరో నాలుగు బోగీలు కలిపితే రాష్ట్రం మరింత అభివృద్ధి చెందుతుందని అన్నారు.

ఈ కార్యక్రమంలో ఏలేరు ప్రాజెక్టు కమిటీ ఛైర్మన్ అడపా భరత్, ఎస్వీఎస్ అప్పలరాజు, మండల టిడిపి అధ్యక్షులు వీరంరెడ్డి కాశిబాబు, కొత్త కొండబాబు, తోట రవి, తోట గాంధీ, మారిశెట్టి భద్రం,చదరం చంటిబాబు,కాకినాడ జిల్లా బిజెపి మహిళా మోర్చా అధ్యక్షురాలు తులసి సాయి అపర్ణ, కిర్లంపూడి మండలం బిజెపి అధ్యక్షులు శరణం రాజబాబు, ప్రభుత్వ అధికారులు, కూటమి నాయకులు, అధిక సంఖ్యలో అంగన్వాడీ టీచర్లు పాల్గొన్నారు.

# పెన్షన్ బకాయిలు విడుదల చేయాలి

గ్రంథాలయ రిటైర్డ్ ఉద్యోగుల వినతి



**ఆలమూరు, పెన్ పవర్, అక్టోబర్ 03:**గ్రంథాలయ సంస్థలోని రిటైర్డ్ ఉద్యోగులకు పెన్షన్ బకాయిలు విడుదల చేయాలని మండల కేంద్రమైన ఆలమూరు గ్రామానికి చెందిన ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా గ్రంథాలయ సంస్థ పెన్షనర్స్ సంఘం మాజీ ప్రచార కార్యదర్శి జి. వెంకట్రావు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న గ్రంథాలయ ఉద్యోగులు, పెన్షనర్లకు గతంలో వార్షిక గ్రాంటు రూ. 140 కోట్లు ప్రభుత్వం విడుదల చేసేదన్నారు. ప్రస్తుతం రూ. 40 కోట్లు మాత్రమే ఇవ్వడంతో ఉద్యోగుల జీతాలు, పెన్షన్ సొమ్ములు రెండు, మూడు నెలలుగా బకాయిలు ఉన్నట్టు తెలిపారు. ప్రధానంగా వయోభారంతో ఆరోగ్య సమస్యలు ఎదుర్కొంటున్న రిటైర్డ్ ఉద్యోగులకు పెన్షన్ అందక తీవ్ర ఇబ్బందులు పడాల్సి వస్తోందన్నారు. సకాలంలో పెన్షన్ సొమ్ములు విడుదల చేసి ఆదుకోవాలని వెంకట్రావు శనివారం ఒక ప్రకటనలో కోరారు.

# గెద్దనాపల్లిలో ఘనంగా పోషణ మాసోత్సవాలు, అంగన్వాడీ ఉత్సవం.

## -నూతన అంగన్వాడీ భవనాన్ని ప్రారంభించిన ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ.





**కిర్లంపూడి,పెన్ పవర్,అక్టోబర్, 03:**కిర్లంపూడి మండలం గెద్దనాపల్లి గ్రామంలో శనివారం పోషణ మాసోత్సవం, అంగన్వాడీ ఉత్సవం ఘనంగా నిర్వహించారు. సీడీపీఓ, ఎం పూర్ణిమ పర్యవేక్షణలో, గ్రామ టీడీపీ నాయకులు సూరిశెట్టి వెంకట శివ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా జగ్గంపేట శాసనసభ్యులు, టీటీడీ బోర్డు సభ్యులు, టీడీపీ పొలిట్ బ్యూరో సభ్యులు జ్యోతుల నెహ్రూ హాజరై నూతనంగా నిర్మించిన అంగన్వాడీ భవనాన్ని ప్రారంభించారు. విశిష్ట అతిథులుగా బీజేపీ జిల్లా అధ్యక్షులు బిక్కిన విశ్వేశ్వరరావు, రాష్ట్ర బీజేపీ కార్యవర్గ సభ్యులు కంబాల శ్రీనివాసరావు హాజరయ్యారు. ప్రధాని నరేంద్ర మోదీ ముఖ్యమంత్రిగా, ప్రధానమంత్రిగా 25 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా అంగన్వాడీ టీచర్లకు పట్టుచీర, స్వీట్ బాక్స్, పసుపు కుంకుమలు పంపిణీ చేశారు.ఈ సందర్భంగా జ్యోతుల నెహ్రూ మాట్లాడుతూ "సేవా సంకల్ప్ – సే వికసిత్ భారత్" స్ఫూర్తితో ఈ ఉత్సవం నిర్వహించుకోవడం సంతోషంగా ఉందన్నారు. 2001 అక్టోబర్ 7న గుజరాత్ ముఖ్యమంత్రిగా ప్రారంభమైన నరేంద్ర మోదీ ప్రజా సేవా ప్రయాణం 25 సంవత్సరాలు పూర్తి చేసుకుంటున్న సందర్భంగా దేశవ్యాప్తంగా సేవా కార్యక్రమాలు జరుగుతున్నాయని తెలిపారు.అంగన్వాడీ కేంద్రం కేవలం భవనం కాదని, గ్రామంలోని తల్లి, బిడ్డ, కుటుంబానికి సేవా కేంద్రమని అన్నారు. ప్రభుత్వ పథకం ఇంటికి చేరడమే సేవ, గర్భిణీకి పోషకాహారంపై అవగాహన కల్పించడమే సేవ, చిన్నారికి ఎదుగుదల, ఆరోగ్యం, విద్య అందించడమే సేవ అని పేర్కొన్నారు.ముఖ్యంగా అంగన్వాడీ స్కూళ్లకు వచ్చే పిల్లలను సొంత పిల్లల్లా చూసుకుని వారికి అన్ని సౌకర్యాలు కల్పించాలని అంగన్వాడీ టీచర్లను కోరారు.కేంద్రంలో నరేంద్ర మోదీ ఆధ్వర్యంలో బీజేపీ ప్రభుత్వం, రాష్ట్రంలో చంద్రబాబు, పవన్ కళ్యాణ్ ఆధ్వర్యంలో కూటమి ప్రభుత్వం డబుల్ ఇంజన్ సర్కార్ తో అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలతో ముందుకు సాగుతోందని అన్నారు. రేపు రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో కూటమి అభ్యర్థులను గెలిపించి మరో నాలుగు బోగీలు కలిపితే రాష్ట్రం మరింత అభివృద్ధి చెందుతుందని అన్నారు.

ఈ కార్యక్రమంలో ఏలేరు ప్రాజెక్టు కమిటీ చైర్మన్ బస్వా వీరబాబు,అడపా భరత్, ఎస్వీఎస్ అప్పలరాజు, మండల టిడిపి అధ్యక్షులు వీరంరెడ్డి కాశిబాబు, కొత్త కొండబాబు, తోట రవి, తోట గాంధీ, మారిశెట్టి భద్రం,చదరం చంటిబాబు,కాకినాడ జిల్లా బిజెపి మహిళా మోర్చా అధ్యక్షురాలు తులసి సాయి అపర్ణ, కిర్లంపూడి మండలం బిజెపి అధ్యక్షులు శరణం రాజబాబు, ప్రభుత్వ అధికారులు, కూటమి నాయకులు, అధిక సంఖ్యలో అంగన్వాడీ టీచర్లు పాల్గొన్నారు.

# మలికిపురంలో ప్రజా నాట్యమండలి జిల్లా మహాసభలు జయప్రదం చేయాలని పిలుపు




**ఆలమూరు, పెన్ పవర్, అక్టోబర్ 03:**కళ కళ కోసం కాదు, ప్రజల చైతన్యం కోసమేనని నిరూపిస్తూ 1943 నుంచి ప్రజానాట్యమండలి ప్రజా సమస్యలపై నిరంతరం పోరాడుతోందని జిల్లా కన్వీనర్ వి. శామ్యూల్, రాష్ట్ర ఉపాధ్యక్షుడు లక్ష్మణరావు తెలిపారు.శనివారం ఆలమూరులోని సమతా కార్యాలయంలో సీనియర్ కళాకారుడు సాయిబాబు అధ్యక్షతన ప్రజానాట్యమండలి ఆలమూరు మండల మహాసభ నిర్వహించారు.ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ, డా. బి.ఆర్. అంబేద్కర్ కోనసీమ జిల్లా మలికిపురంలో అక్టోబర్ 24, 25 తేదీల్లో ప్రజానాట్యమండలి ప్రథమ జిల్లా మహాసభలు జరుగుతాయని వెల్లడించారు. అక్టోబర్ 24న యువత, మహిళల కోసం అభ్యుదయ పాటల శిక్షణా శిబిరం, 25న జిల్లా మహాసభ నిర్వహిస్తామన్నారు. దేశంలో పెరుగుతున్న విద్యార్థి, ప్రజా సమస్యలపై కళారూపాల ద్వారా చైతన్యం తెస్తామని, ఈ మహాసభలకు యువత, మహిళలు, ప్రజలు పెద్ద ఎత్తున హాజరై జయప్రదం చేయాలని కోరారు.

**నూతన కమిటీ ఎన్నిక.**

మహాసభలో ఆలమూరు మండల నూతన కమిటీని ఎన్నుకున్నారు.గౌరవ అధ్యక్షుడిగా యేసురాజు, అధ్యక్షుడిగా కర్రి సాయిబాబు, కార్యదర్శిగా ఎన్.చంద్రరావు ఎంపికయ్యారు. కమిటీ సభ్యులుగా ఈశ్వరి, రమణయ్య, భవాని, వరలక్ష్మి, రవికుమార్, సహవాసరావులను ఎన్నుకున్నారు.ఈ కార్యక్రమంలో సీనియర్ కళాకారులు యేసుదాసు,రామకృష్ణ, యాకోబు, పద్మ తదితరులు పాల్గొన్నారు.

# ఇంటర్మీడియట్ దశనుంచే పోటీ పరీక్షలపై అవగాహన పెంచుకోవడం తప్పనిసరి



కాకినాడ సత్యం స్టడీ సర్కిల్స్ అధినేత బూసి విద్యాసాగర్

**ఆలమూరు, పెన్ పవర్, అక్టోబర్ 03:**ఇంటర్మీడియట్ దశ నుంచే పోటీ పరీక్షలపై అవగాహన పెంచుకోవడం ద్వారా భవిష్యత్తులో మెరుగైన ఫలితాలు రావటానికి అవకాశం ఉంటుందని కాకినాడ సత్యం స్టడీ సర్కిల్ అధినేత బూసి విద్యాసాగర్ విద్యార్థులకు దిశా నిర్దేశం చేశారు. ఆలమూరు ప్రభుత్వ జూనియర్ కళాశాలలో శనివారం ఆయన ఇంటర్మీడియట్ విద్యార్థులతో పాటుగా శ్రీవిద్యా పబ్లిక్ స్కూల్ లో 9, 10 తరగతులు చదువుతున్న విద్యార్థులకు పోటీ పరీక్షల సన్నాహక అంశాలపై అవగాహన కల్పించారు. తాను సైతం ఇదే ప్రభుత్వ పాఠశాలలో చదువుకొని ఎందరో విద్యార్థులను ఉన్నత స్థాయి అధికారులుగా తీర్చిదిద్దడం జరిగిందన్నారు. ఇంటర్మీడియట్ నుంచే పోటీ పరీక్షలకు సన్నద్ధం కావడం ద్వారా పరీక్షలపై భయం పోవడంతో పాటు, బ్యాంకింగ్, సివిల్స్,గ్రూప్స్ వంటి పరీక్షల సిలబస్, పరీక్ష విధానాలపై అవగాహన ఏర్పడుతుందన్నారు. పోటీ పరీక్షల్లో ఏవిధంగా ముందడుగు వేయాలో విద్యార్థులకు వివరించారు. అనంతరం కళాశాల ప్రిన్సిపాల్ నల్లమిల్లి సురేష్ రెడ్డి బూసి విద్యాసాగర్ ను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ నల్లమిల్లి సురేష్ రెడ్డి, ఆలమూరు సివిల్ కోర్ట్ ఏ జి పి బూసి విద్యా ప్రసన్న, ముప్పిరి వెర్రియ్య, విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు.

# హోరెత్తిన వీఆర్ఏల ఆందోళన.

కళ్లకు గంతలు, చెవుల్లో పువ్వులతో వినూత్న నిరసన..




**ఆలమూరు, పెన్ పవర్, అక్టోబర్ 03:**తమ న్యాయమైన డిమాండ్లను వెంటనే పరిష్కరించాలంటూ గ్రామ రెవెన్యూ సహాయకులు (వీఆర్ఏలు) చేపట్టిన నిరవధిక సహాయ నిరాకరణ ఉద్యమం శనివారంతో 18వ రోజుకు చేరుకుంది. ఆలమూరు తాసిల్దార్ కార్యాలయం ఎదుట ఉన్న ధర్నా చౌక్ వద్ద మండల వీఆర్ఏలు కళ్లకు నల్ల గంతలు కట్టుకుని, చెవుల్లో పువ్వులు పెట్టుకుని ప్రభుత్వంపై వినూత్న రీతిలో నిరసన వ్యక్తం చేశారు.ఈ సందర్భంగా మండల వీఆర్ఏల సంఘం అధ్యక్షుడు తాతపూడి ఇస్సాక్ మాట్లాడుతూ... పక్క రాష్ట్రమైన తెలంగాణలో వీఆర్ఏలకు అమలు చేస్తున్నట్లే ఇక్కడ కూడా పే స్కేల్ వర్తింపజేయాలని డిమాండ్ చేశారు. అర్హత కలిగిన వారికి పదోన్నతులు కల్పించాలని, అలాగే వివిధ కారణాలతో మరణించిన వీఆర్ఏల కుటుంబాల్లోని ఒకరికి కారుణ్య నియామకాల కింద ఉద్యోగం ఇవ్వాలని కోరారు. ప్రభుత్వం ఇప్పటికైనా స్పందించి తమ కోరికలను నెరవేర్చాలని విజ్ఞప్తి చేశారు.ఈ నిరసన కార్యక్రమంలో సంఘం కార్యదర్శి కె. శివరామారావు,ఉపాధ్యక్షుడు భువనగిరి ఏసు, సలహాదారు నాగేశ్వరరావు, కోశాధికారి కుందేటి శ్రీనుతో పాటు సభ్యులు యార్లగడ్డ జీవరత్నం, ఏడిది వెంకటాద్రి, బూరిగ మంగాలక్ష్మీ, చోడవరపు రామలక్ష్మి, కోట లక్ష్మీ, షేక్ బషీర్ బీబీ, తదితరులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# రేషన్ డీలర్ దురుసు ప్రవర్తనపై ఫిర్యాదు

✹ డిప్యూటీ తహశీల్దార్‌కు కార్డుదారుల లిఖితపూర్వక వినతి



**రావులపాలెం పెన్ పవర్ అక్టోబర్ 3:** మండల కేంద్రంలోని ఇందిరా కాలనీ ప్రభుత్వ చౌకధరల దుకాణం (0444034) డీలర్ పడాల శ్రీనివాసరెడ్డి కార్డుదారుల పట్ల నిర్లక్ష్యంగా, దురుసుగా వ్యవహరిస్తున్నారంటూ బీజేపీ సంచార జాతుల కన్వీనర్ వీర్నాల రమణబాబు స్థానికుల సంతకాలతో డిప్యూటీ తహశీల్దార్‌కు లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేశారు.రేషన్ సరుకుల పంపిణీ సమయంలో కార్డుదారులపై కసురుకోవడంతో పాటు బాధ్యతారహితంగా వ్యవహరిస్తున్నారని ఫిర్యాదులో పేర్కొన్నారు. దుకాణంలో సహాయకుడిని నియమించుకోకుండా వినియోగదారులతోనే బియ్యం బస్తాలు ఎత్తించడం, దింపించడం వంటి పనులు చేయిస్తున్నారని ఆరోపించారు. దీంతో వృద్ధులు, మహిళలు, ఇతర కార్డుదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు.ప్రభుత్వ రేషన్ వ్యవస్థలో లబ్ధిదారులకు ఇబ్బందులు కలగకుండా నిబంధనల మేరకు సరుకుల పంపిణీ జరిగేలా అధికారులు పర్యవేక్షించాలని కోరారు. ఆరోపణలపై సమగ్ర విచారణ నిర్వహించి, తప్పులు నిర్ధారణ అయితే సంబంధిత డీలర్‌పై శాఖాపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో బీజేపీ ఓబీసీ మోర్చా మండల అధ్యక్షుడు మహాలక్ష్మిరావు, స్థానిక కార్డుదారులు పాల్గొన్నారు. ఫిర్యాదుపై విచారణ చేపట్టి నిబంధనల మేరకు తగిన చర్యలు తీసుకుంటామని డిప్యూటీ తహశీల్దార్ హామీ ఇచ్చారు.

# జగ్గంపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో అతిథి ఉపన్యాసం




**జగ్గంపేట, పెన్ పవర్, అక్టోబరు 3:** స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ప్రిన్సిపాల్ డాక్టర్ డి.చెన్నారావు ఆధ్వర్యంలో ఆంగ్ల విభాగం ప్రస్తుత ఉద్యోగ పరిస్థితుల్లో కమ్యూనికేషన్ సాఫ్ట్ స్కిల్స్ ప్రాముఖ్యత అనే అంశంపై అతిథి ఉపన్యాసం నిర్వహించారు. రాజమహేంద్రవరం ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఆంగ్ల విభాగం అధ్యాకులు డాక్టర్ నూజిళ్ల శ్రీనివాస్ ముఖ్యఅతిథిగా హాజరై విద్యార్థులకు అవగాహన కల్పించారు. కమ్యూనికేషన్ స్కిల్స్, సాఫ్ట్ స్కిల్స్ ప్రాధాన్యతను వివరించారు. అనంతరం డాక్టర్ నూజిళ్ల శ్రీనివాసు సత్కరించారు.

# పినపళ్లలో భారీ అన్నసమారాధన



**ఆలమూరు, పెన్ పవర్, అక్టోబర్ 03:**శ్రీ గణపతి నవరాత్రి ముగింపు ఉత్సవాలను పురస్కరించుకుని డాక్టర్ బీఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా ఆలమూరు మండలంలోని పినపళ్లలో వేంచేసియున్న శ్రీవిఘ్నేశ్వరుడి ఆలయం వద్ద శనివారం భారీ అన్నసమారాధన నిర్వహించారు. స్థానిక ఆలయ ప్రాంగణంలో గ్రామస్తుల సహకారంతో పిండివంటలతో ఈ అన్నసమారాధనను నిర్వాహకులు ఏర్పాటు చేశారు. పినపళ్ళ తో పాటుగా పరిసర ప్రాంతాల నుంచి సుమారు ఐదు వేల మంది భక్తులు విచ్చేసి ఈ అన్నప్రసాదాన్ని స్వీకరించారు. ఈ సందర్భంగా ఆలయం వద్ద పలు ఆధ్యాత్మిక, సాంస్కృతిక కార్యక్రమాలను ఏర్పాటు చేశారు. మాజీ సర్పంచ్ సంగిత సుభాష్, ఏఎంసీ మాజీ చైర్మన్ వక్కపట్ల లక్ష్మణరావు తదితరులు పాల్గొన్నారు.

# మురళీకృష్ణంరాజు కుటుంబానికి పలువురు నాయకులు పరామర్శ





**కిర్లంపూడి,ప్రత్తిపాడు, పెన్ పవర్,అక్టోబర్,03**: వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి, నరసాపురం పార్లమెంట్ నియోజకవర్గం పరిశీలకులు, ప్రత్తిపాడు నియోజకవర్గ వైసిపి నాయకులు, ఎంఎంఆర్ చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ ముదునూరి మురళీ కృష్ణంరాజు కుటుంబానికి శనివారం పలువురు నాయకులు పరామర్శించారు. కృష్ణంరాజు తండ్రి ముదునూరి రామరాజు ఇటీవల మృతి చెందారు. విషయము తెలుసుకున్న పలువురు వైసీపీ నాయకులు, టిడిపి నాయకులు మురళీ కృష్ణంరాజు, ఆయన సోదరుడు సీతారామరాజుతోపాటు వారి కుటుంబ సభ్యులను పరామర్శించి తమ తీవ్ర ప్రగాఢ సంతాపాన్ని తెలియజేయడమే కాకుండా, రామరాజు చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. కృష్ణంరాజు కుటుంబ సభ్యులను పరామర్శించిన వారిలో మాజీ మంత్రి, విశాఖపట్నం, విజయనగరం జిల్లాల రీజనల్ కోఆర్డినేటర్ కురసాల కన్నబాబు, మాజీ పార్లమెంటు సభ్యురాలు, పిఠాపురం నియోజకవర్గం వైసీపీ ఇంచార్జ్ వంగా గీతా విశ్వనాథ్ , ప్రత్తిపాడు నియోజకవర్గం వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ ముద్రగడ గిరిబాబు, భీమవరం నియోజకవర్గం వైసిపి నాయకులు, వైసీపీ రైతు విభాగం రాష్ట్ర కార్యదర్శి అల్లూరి రవిరాజు, బీసీ విభాగం రాష్ట్ర కార్యదర్శి కొడే యుగంధర్, రాష్ట్ర మహిళా విభాగం కార్యదర్శి, చికిలే మంగతాయారు,హైకోర్టు న్యాయవాది నల్లమిల్లి శివారెడ్డి, సుబ్బారెడ్డి తోపాటు ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా, పశ్చిమగోదావరి జిల్లాకు చెందిన పలువురు వైసీపీ నాయకులు, కూటమి నాయకులు, మురళీ కృష్ణంరాజు అభిమానులు భారీగా తరలివచ్చి మురళీకృష్ణంరాజు కుటుంబ సభ్యులను పరామర్శించారు.

## జనార్దనుని దర్శనంతో పులకించిన భక్తజనం

- కిక్కిరిసిన క్యూలైన్లు, వెల్లువెత్తిన భక్తులు





**ఆలమూరు, పెన్ పవర్ అక్టోబర్ 03:**నవ జనార్దన ఆలయాల్లో నాలుగవ క్షేత్రమైన ఆలమూరు శ్రీదేవి, భూదేవి సమేత శ్రీ జనార్దన స్వామి వారి ఆలయం శనివారం నాడు భక్తజన సందోహంతో కిటకిటలాడింది. దూర ప్రాంతాల నుంచి సైతం అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చి స్వామివారిని దర్శించుకున్నారు. క్యూలైన్లు భక్తులతో నిండిపోయాయి. వివిధ పుష్ప మాలికలతో అలంకృతమైన స్వామివారి దివ్య రూపం భక్తులను విశేషంగా ఆకట్టుకుంది. జయ జయ జనార్ధన పాహి...పాహి.... రక్ష... రక్ష అంటూ భక్తులు గోవింద నామ స్మరణతో ఆలయ ప్రాంగణాన్ని హోరెత్తించారు. స్వామి వారి దర్శనానికి వచ్చిన భక్తులకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా ఆలయ చైర్మన్ బైరిశెట్టి రాంబాబు, సభ్యులు, స్వామివారి సేవకులు దగ్గరుండి అన్ని ఏర్పాట్లను పర్యవేక్షించారు. ఆలయ అర్చకులు అంగర భగవానాచార్యులు స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించి భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు. దూర ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులకు మధ్యాహ్నం అన్న ప్రసాద వితరణ జరిపారు.

# పోలింగ్ కేంద్రాల్లో మౌలిక సౌకర్యాలు కల్పించాలి- ఎంపీడీవో జె. రాంబాబు





**కాజులూరు, పెన్ పవర్, అక్టోబర్ 3:**త్వరలో జరగనున్న స్థానిక సంస్థల ఎన్నికలకు సంబంధించి ఎంపీటీసీ ఎన్నికల పోలింగ్ కేంద్రాల్లో ఓటర్లకు పూర్తిస్థాయి మౌలిక సౌకర్యాలు కల్పించాలని ఎంపీడీవో జె. రాంబాబు పంచాయతీ కార్యదర్శులను ఆదేశించారు. శనివారం కాజులూరు మండల పరిషత్ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడారు.కాజులూరు మండల పరిధిలోని 26 గ్రామ పంచాయతీలు,20 ఎంపీటీసీ స్థానాలకు 66 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. ప్రతి పోలింగ్ కేంద్రంలో ఓటర్లకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని సూచించారు.ప్రధానంగా తాగునీరు, విద్యుత్, మరుగుదొడ్లు, పారిశుద్ధ్యం తదితర మౌలిక సదుపాయాలను పరిశీలించి, అవసరమైన చోట్ల మరమ్మతులు చేపట్టి పోలింగ్‌కు ముందే పూర్తిస్థాయిలో సిద్ధం చేయాలని ఆదేశించారు. పంచాయతీ కార్యదర్శులు తమ పరిధిలోని పోలింగ్ కేంద్రాలను స్వయంగా పరిశీలించి, లోటుపాట్లను గుర్తించి వెంటనే పరిష్కరించాలని ఎంపీడీవో రాంబాబు సూచించారు. ఈ సమావేశంలో డిప్యూటీ ఎంపీడీవో ముద్రగడ సత్యనారాయణ మూర్తి, కార్యాలయ కార్యనిర్వహణ అధికారి పద్మలత,సీనియర్ అసిస్టెంట్ నాగరాజు,పంచాయతీ కార్యదర్శులు కె. ఈశ్వరి,సిహెచ్.సూర్యప్రకాశరావు,కె. రవి ప్రసాద్,వీరబాబు,తాతాజీ, శివకుమార్,సునీల్,డి.అపర్ణ,శృతి,కె.లక్ష్మమ్మ, పి.త్రిమూర్తులు, ఎస్.ఇషాంత్,విజయ్ కుమార్, సుబ్బరాయుడు,సాయి కిరణ్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## జీజీహెచ్‌లో నాణ్యమైన వైద్య సేవలు అందించాలి





**నిర్మాణ పనులను వేగవంతం చేసి అందుబాటులోకి తీసుకురావాలి**

**కలెక్టర్ ఎం.ఎన్. హరేంధిర ప్రసాద్**

**కాకినాడ, పెన్ పవర్, అక్టోబర్ 3:**కాకినాడ ప్రభుత్వ సామాన్య ఆసుపత్రి (జీజీహెచ్)కు వచ్చే పేద ప్రజలకు మెరుగైన, నాణ్యమైన వైద్య సేవలను సకాలంలో అందించేందుకు వైద్య అధికారులు చిత్తశుద్ధితో పనిచేయాలని జిల్లా కలెక్టర్ ఎం.ఎన్. హరేంధిర ప్రసాద్ ఆదేశించారు. ఆసుపత్రిలో వివిధ దశల్లో ఉన్న నిర్మాణ పనులను వేగవంతం చేసి, నిర్దిష్ట గడువులోగా పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని సూచించారు.శనివారం కాకినాడ కలెక్టరేట్‌లో జీజీహెచ్‌లో అందిస్తున్న వైద్య సేవలు, వివిధ బ్లాకుల్లో జరుగుతున్న నిర్మాణ పనుల పురోగతిపై వైద్యాధికారులతో కలెక్టర్ సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆసుపత్రిలో పేదలకు అందుతున్న వైద్య సేవల నాణ్యత, వార్డుల్లో పారిశుధ్యం, తాగునీటి వసతి, మందుల సరఫరా, ఆహార పదార్థాల నాణ్యత, వివిధ సివిల్ పనుల పురోగతి, మౌలిక సదుపాయాల కల్పనపై అధికారులతో చర్చించారు.సుదూర ప్రాంతాల నుంచి వైద్యం కోసం జీజీహెచ్‌కు వచ్చే పేదలకు నాణ్యమైన వైద్య సేవలను అత్యంత పారదర్శకంగా అందించాలని కలెక్టర్ స్పష్టం చేశారు. రోగులకు అందించే వైద్య సేవల విషయంలో ఆయా విభాగాల అధిపతులు ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. విధుల్లో నిర్లక్ష్యంగా వ్యవహరించే వైద్యాధికారులపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.ఆసుపత్రిలో పారిశుధ్యం, తాగునీరు, ఆహార పదార్థాల సరఫరా వంటి అంశాలపై ప్రత్యేక దృష్టి పెట్టాలని ఆదేశించారు. జీజీహెచ్‌లో రూ.23.75 కోట్లతో క్రిటికల్ కేర్ బ్లాక్ నిర్మాణ పనులు, రూ.2.25 కోట్లతో నిర్వహణ, మరమ్మతుల పనులు, రూ.69.88 లక్షలతో వార్షిక నిర్వహణ పనులు చేపడుతున్నట్లు తెలిపారు. ఈ పనుల్లో మరింత పురోగతి సాధించి, నిర్దిష్ట గడువులోగా పూర్తి చేయాలని సూచించారు.వివిధ వార్డుల్లో చేపడుతున్న మరుగుదొడ్లు, ఇతర నిర్మాణ పనుల్లో తప్పనిసరిగా నాణ్యతా ప్రమాణాలు పాటించాలని కలెక్టర్ స్పష్టం చేశారు. అన్ని పనులపై ఇంజనీరింగ్ అధికారులు ప్రత్యేక దృష్టి సారించి, నిర్ణీత లక్ష్యంలోగా పూర్తి చేసి వినియోగంలోకి తీసుకురావాలని ఆదేశించారు.ప్రపంచ మానసిక ఆరోగ్య వారోత్సవాల సందర్భంగా ఈ నెల 4 నుంచి 10వ తేదీ వరకు నిర్వహించనున్న కార్యక్రమాలపై రూపొందించిన గోడపత్రికను కలెక్టర్ జీజీహెచ్ వైద్యాధికారులతో కలిసి ఆవిష్కరించారు.ఈ సమావేశంలో జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ లావణ్య కుమారి, డిప్యూటీ సూపరింటెండెంట్ డాక్టర్ శ్రీనివాసన్, అడ్మినిస్ట్రేటర్ ఎన్. శ్రీధర్, ఏపీఎంఎస్ఐడీసీ ఈఈ రత్నరాజు, జీజీహెచ్‌లోని వివిధ విభాగాల అధిపతులు, ఇతర వైద్యాధికారులు పాల్గొన్నారు.

## ముద్రగడ గిరిబాబును మర్యాదపూర్వకంగా కలసిన వంగా గీతా విశ్వనాధ్.





**కిర్లంపూడి, పెన్ పవర్, అక్టోబర్, 03:** కాకినాడ జిల్లా మండల కేందమైన కిర్లంపూడి ముద్రగడ పద్మనాభం నివాసంలో ప్రతిపాడు నియోజకవర్గం వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఇన్‌ఛార్జ్ ముద్రగడ గిరిబాబును, కాకినాడ మాజీ పార్లమెంటు సభ్యురాలు, పిఠాపురం నియోజకవర్గం వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ వంగా గీతావిశ్వనాథ్ శనివారం మర్యాదపూర్వకంగా కలిశారు.ఈ సందర్భంగా ముద్రగడ చిత్రపటానికి ఘనంగా నివాళులు అర్పించారు. అనంతరం ముద్రగడ సతీమణి పద్మావతిని కలసి, ఆమె యోగక్షేమాలను, ఆరోగ్య పరిస్థితులను అడిగి తెలుసుకున్నారు.

## పెనికేరులో బిసి కమ్యూనిటీ హాల్ నిర్మాణానికి స్థల పరిశీలన



**ఆలమూరు, పెన్ పవర్, అక్టోబర్ 03:**ఆలమూరు మండలంలోని పెనికేరు గ్రామంలో నూతనంగా నిర్మించతలపెట్టిన బిసి కమ్యూనిటీ హాల్ నిర్మాణ స్థలాన్ని ఎంపీడీవో ఏ. రాజు, టీడీపీ సీనియర్ నాయకులు, వెంకటేశ్వర సంస్థల అధినేత ఈదర చినబాబు, కూటమి నాయకులు శనివారం క్షేత్రస్థాయిలో పరిశీలించారు. స్థల అనుకూలతను పరిశీలించిన అనంతరం ఆవరణలోని పరిసరాలను సమీక్షించారు.ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ.. బీసీ కమ్యూనిటీ హాల్ భవన నిర్మాణానికి ఒఎన్జీసీ నిధుల నుంచి రూ. 15 లక్షలు మంజూరైనట్లు వెల్లడించారు. ఆదివారం కొత్తపేట శాసనసభ్యులు బండారు సత్యానందరావు ముఖ్య అతిథిగా హాజరై, కూటమి నాయకులతో కలిసి భవన నిర్మాణానికి శంకుస్థాపన (భూమి పూజ) చేయనున్నారని తెలిపారు. అంతేకాకుండా, గ్రామంలో ఇటీవల పూర్తి చేసిన సీసీ రోడ్లను కూడా ఎమ్మెల్యే బండారు సత్యానందరావు చేతుల మీదుగా ప్రారంభం చేయనున్నట్లు పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో ఎంపీడీవో రాజు మాట్లాడుతూ, పెనికేరు గ్రామ సమగ్ర అభివృద్ధికి టీడీపీ సీనియర్ నేత ఈదర చినబాబు చూపుతున్న చిత్తశుద్ధి, అందిస్తున్న సహాయ సహకారాలను ప్రత్యేకంగా అభినందించారు. అనంతరం చినబాబు మాట్లాడుతూ, రాబోయే రోజుల్లో గ్రామాన్ని మరిన్ని రకాలుగా అభివృద్ధి చేసి సంక్షేమ పథకాలను అందించడానికి తన వంతు సహకారాన్ని నిరంతరం అందిస్తానని హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు గొడవర్తి భాస్కరరావు, కోన దత్తుడు, స్థానిక ప్రజాప్రతినిధులు నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# పారిశుద్ధ్యంపై నిర్లక్ష్యం చేస్తే చర్యలు

**డ్రెయిన్లు, కాంపాక్టర్ల వద్ద చెత్త నిల్వ ఉండకూడదు**

**కమిషనర్ ఎన్.వి.వి. సత్యనారాయణ**

**కాకినాడ, పెన్ పవర్, అక్టోబర్ 3:**కాకినాడ నగరంలో పారిశుద్ధ్య నిర్వహణలో ఎలాంటి నిర్లక్ష్యానికి తావివ్వకుండా సమస్యాత్మక ప్రాంతాలను గుర్తించి తక్షణ చర్యలు చేపట్టాలని నగరపాలక సంస్థ కమిషనర్ ఎన్.వి.వి. సత్యనారాయణ ఆదేశించారు. శనివారం నగరపాలక సంస్థ కార్యాలయంలో శానిటేషన్ ఇన్‌స్పెక్టర్లు, సచివాలయ శానిటేషన్ సెక్రటరీలతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో డ్రెయిన్ల శుభ్రత, నిల్వ నీటి నివారణ, ఇంటింటి చెత్త సేకరణ, కాంపాక్టర్ల నిర్వహణ తదితర అంశాలపై సమీక్షించారు.స్థానిక కమ్యూనిటీ నాయకులతో సమన్వయం చేసుకుని తమ పరిధిలోని సమస్యాత్మక, ప్రమాదకర ప్రాంతాలను గుర్తించి పారిశుద్ధ్య పనులు చేపట్టాలని సూచించారు. ప్రతి శానిటేషన్ సెక్రటరీ తమ పరిధిలోని డ్రెయిన్లను స్వయంగా పరిశీలించి, శుభ్రత పనులను దగ్గరుండి పర్యవేక్షించాలని, పనుల పురోగతిపై నివేదికలు సమర్పించాలని ఆదేశించారు.ఎక్కడైనా నీరు నిలిచే పరిస్థితి ఉంటే వెంటనే తొలగించే చర్యలు చేపట్టాలని కమిషనర్ స్పష్టం చేశారు. అవసరమైన ప్రాంతాల్లో జెట్టింగ్ యంత్రాలను వినియోగించి డ్రెయిన్లలో పేరుకుపోయిన వ్యర్థాలు, మురుగునీటిని తొలగించాలని సూచించారు. నీరు ముందుకు వెళ్లేందుకు మార్గం లేని ప్రాంతాల్లో తాత్కాలికంగా కచ్చా డ్రెయిన్లు ఏర్పాటు చేసి నిల్వ నీటిని మళ్లించాలని ఆదేశించారు. దోమల నియంత్రణకు అవసరమైన ప్రాంతాల్లో ఫాగింగ్ నిర్వహించాలని తెలిపారు.స్వయంభూ వాహనాల ద్వారా ఇంటింటికీ వెళ్లి చెత్త సేకరణ పకడ్బందీగా జరిగేలా చూడాలని కమిషనర్ సూచించారు. కాంపాక్టర్ల వద్ద ఎక్కడా వ్యర్థాలు పేరుకుపోకుండా ఎప్పటికప్పుడు తరలించేలా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. కాంపాక్టర్ల వద్ద చెత్త నిల్వ ఉన్నట్లు గుర్తిస్తే సంబంధిత శానిటేషన్ సెక్రటరీనే బాధ్యుడిని చేస్తామని స్పష్టం చేశారు.క్షేత్రస్థాయిలో సిబ్బంది నిరంతరం పర్యటిస్తూ ప్రజలకు ఎదురవుతున్న పారిశుద్ధ్య సమస్యలను గుర్తించి వెంటనే పరిష్కరించాలని కమిషనర్ సూచించారు. ప్రతి శానిటేషన్ ఇన్‌స్పెక్టర్, సెక్రటరీ తమ పరిధిలో పారిశుద్ధ్య నిర్వహణపై పూర్తి బాధ్యత వహించాలని ఆదేశించారు. సమావేశంలో సూపరింటెండెంట్ రామశాస్త్రి, శానిటేషన్ సూపర్వైజర్ రాంబాబు, శానిటేషన్ ఇన్‌స్పెక్టర్లు పాల్గొన్నారు.




Printed by Published by GANTYADA APPARAO on behalf of GANTYADA APPARAO, printed at printed at SRI SAI GANGA PRINTERS AND PUBLISHERS FLAT NO: 504, Bharat Towers, 5th lane, Dwaraka Nagar, Visakhaptanam, Andhrapradesh-530016, and published at Flat No F2, Nihar towers, Srinagar, kakinada, kakinada District-533003
Editor: GANTYADA APPARAO. Mobile : 9059465965, RNI : APTEL/2017/73154 , editorpenpower@gmail.com